

శ్రీనివాస కల్యాణం ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నేడు నర్సీపట్నంలో శ్రీనివాస కల్యాణం

టీటీడీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు

- పరిశీలించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సోమవారం సాయంత్రం జరిగే శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవానికి భక్తులంతా హాజరై కనులారా వీక్షించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, టీడీపీరాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆదివారం మినీ స్టేడియం వద్దకు వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు. స్వామి వారి కల్యాణ వేడుకను తిలకించడానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌర్యం లేకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని స్పీకర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కలియుగ దైవమైన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నర్సీపట్నంలో నిర్వహించనుండడం ఈ ప్రాంత భక్తుల అదృష్టమని అన్నారు. స్వామి వారి వేడుకను విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.



భోగాపురం వద్ద కోతకు గురైన శారదా నది గట్టును పరిశీలిస్తున్న మంత్రి రవీంద్ర, పక్కన ఎమ్మెల్యే రాజు

తుఫాన్ నష్టంపై త్వరలో నివేదిక

శారదా నది గట్టు పటిష్ఠతకు చర్యలు

- బీఎన్ రోడ్డు పనులు నెలలో ప్రారంభం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర



నది గట్టుకు రక్షణ గోడ నిర్మించాలని మంత్రి రవీంద్రను కోరుతున్న మహిళా రైతులు

చోడవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలు, ఆస్తి నష్టంపై అంచనాలు వేస్తున్నారని, త్వరలోనే ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుతో కలిసి భోగాపురం వద్ద శారదా నది గట్లను, రాయపురాజుపేటలో కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శారదా పరీవాహక ప్రాంతాల్లో పరిస్థితిని పరిశీలించామని, రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. తుఫాన్ నష్టానికి సంబంధించి సీఎం చంద్రబాబునాయుడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు తెప్పించుకుంటున్నారని, తుఫాన్ బాధితులకు ఇప్పటికే అత్యవసర సహాయ కార్యక్రమాలు పూర్తయ్యాయని చెప్పారు. రహదారులు, ఇరిగేషన్, ఇతర రంగాలకు సంబంధించి దశలవారీగా మరమ్మతు పనులు చేపడతామని తెలిపారు. నదుల గట్లను పటిష్ఠం చేయాల్సిన అవసరం వుందని ... మిగతా 6వ పేజీలో

స్టీల్‌ప్లాంట్‌కు మార్గం సుగమం

ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్స్‌కు అటవీ, పర్యావరణ శాఖల నుంచి గ్రీన్ సిగ్నల్

- ఈ నెల 14న శంకుస్థాపన?
- రూ.1,47,162 కోట్ల పెట్టుబడి
- మొదటి దశలో 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం
- 2029నాటికి ఉత్పత్తి ప్రారంభం
- రెండో దశలో 10.5 మిలియన్ టన్నులు.. 2033నాటికి పూర్తి
- 63 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- అనుబంధంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు రాక
- మౌలిక వసతుల కల్పన పనులు మొదలు



నీటి సరఫరా పనుల కోసం వెదుళ్లపాలెం వద్దకు చేర్చిన పైపులు

నక్కపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): **నక్కపల్లి మండలంలోని విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూముల్లో భారీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు మార్గం సుగం అయ్యింది. ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్స్ సంయుక్తంగా నిర్మించ తలపెట్టిన ఈ స్టీల్‌ప్లాంట్‌కు అటవీ, పర్యావరణ శాఖల అనుమతులు లభించడంతో మరో పది రోజుల్లో భూమి పూజ చేయనున్నట్టు సమాచారం. తొలిదశలో 8.2 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో దీనిని నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాయి.**



ట్రాలర్ లారీపై సీహెచ్ఎన్ అగ్రహారం వద్దకు తీసుకువచ్చిన భారీ పైపులు

యూరప్‌లోని లక్సెంబర్గ్‌కు చెందిన ఆర్సెలార్ మిట్టల్, జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ కంపెనీసంయుక్తంగా నక్కపల్లి మండలంలో భారీ ఉక్కుపరిశ్రమను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ కోసం ప్రభుత్వం గతంలో రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, డీఎల్‌పురం, వేంపాడు, చందనాడ గ్రామాల పరిధిలో గతంలో సుమారు 3,555 ఎకరాలను సేకరించింది. ఇందులో బుచ్చిరాజజుపేటలో 102.18 ఎకరాలు, చందనాడలో 840.2 ఎకరాలు, డీఎల్‌పురంలో 674.39 ఎకరాలు, రాజయ్యపేటలో 36.62 ఎకరాలు, వేంపాడులో 510.92 ఎకరాలు.. మొత్తం 2,164.31 ఎకరాలను స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించింది. మొత్తం రూ.1,47,162 కోట్ల పెట్టుబడులతో రెండు దశల్లో నిర్మించే స్టీల్ ప్లాంట్‌కు అటవీ, పర్యావరణ శాఖలు మినహా మిగిలిన అన్ని అనుమతులు ఇప్పటికే వచ్చేశాయి. సెప్టెంబరు 27వ తేదీన పాటిమీద గ్రామం వద్ద నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటును ఎవరూ వ్యతిరేకించలేదు. తాజాగా అటవీ, పర్యావరణ శాఖల అనుమతులు కూడా లభించడంతో మొదటి దశ నిర్మాణ పనులకు ఈ నెల 14వ తేదీన శంకుస్థాపన చేయనున్నట్టు సమాచారం.

నాలుగేళ్లలో మొదటి దశ ఉత్పత్తి

స్టీల్‌ప్లాంట్ మొదటి దశ పనులను 2029నాటికి పూర్తిచేయాలని యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకున్నది. తొలుత 7.3 లక్షల టన్నుల వార్షిక ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో ప్రారంభిస్తారు. రెండో దశలో 10.5 మిలియన్ టన్నులు వార్షిక ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో 2033 నాటికి పనులు పూర్తిచేస్తారు. స్టీల్‌ప్లాంట్ అవసరాల నిమిత్తం (ముడి సరుకు దిగుమతి, ఉక్కు ... మిగతా 6వ పేజీలో

చురుగ్గా శారదా గట్టు గండి పూడ్చివేత పనులు

- మూడు రోజుల్లో పూర్తవుతాయని అధికారులు వెల్లడి



శారదా నది గట్టుకు పడిన గండిని ఇసుక బస్తాలతో పూడుస్తున్న కూలీలు

రాంబిల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రజాల అగ్రహారం రెవెన్యూ పరిధిలో మేజర్ శారదా నది కుడి గట్టుకు ఇటీవల పడిన గండి పూడ్చివేత పనులు చురుగ్గా సాగుతున్నాయి. 'మొంథా' తుఫాన్ ప్రభావంతోకురిసిన భారీ వర్షాలకుతోడు రైవాడ, పెద్దేరు, కోనాం జలాశయాల నుంచి పెద్ద మొత్తంలో వరద నీటిని విడుదల చేయడంతో శారదా నది ఉగ్రరూపం దాల్చిన విషయం తెలిసిందే. ఈ నది రాంబిల్లి మండలంలో సముద్రంలో కలుస్తుంది. ఇక్కడ ప్రత్యామ్నాయ నేవల్ బేస్ నిర్మిస్తుండడంతో వరద నీరు సముద్రంలోకి వేగంగా వెళ్లడంలేదు. దీంతో రజాల అగ్రహారం వద్ద గత నెల 30వ తేదీన సుమారు 120 మీటర్ల మేర గండి పడింది. వరద నీరు పొలాలు, ఆక్వా చెరువుల్లోకి పోటెత్తడంతో వెయ్యి ఎకరాలకుపైగా వరి పంట ముంపునకు గురైంది. అదే రోజు కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమర్, సంబంధిత అధికారులు వెళ్లి పరిశీలించారు. గండి పూడ్చివేత పనులు చేపట్టాలని ఆదేశించడంతో 35 వేల ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. శుక్రవారం సాయంత్రం నుంచి నదిలో వరద తగ్గుముఖం పట్టడంతో సుమారు 40 మంది కూలీలను ఏర్పాటు చేసి ఇసుక బస్తాలతో గండి పూడ్చివేత పనులు చేపట్టారు. వీరికి ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎస్ సిబ్బంది సహకారం అందిస్తున్నారు. ఆదివారంనాటికి సుమారు 50 శాతం పనిపూర్తయ్యిందని, మూడు రోజుల్లో గండి మొత్తం పూడ్చివేసి పటిష్ఠం చేస్తామని జలవనరుల శాఖ ఏఈ శివాజీ తెలిపారు.

ఆర్‌ఈసీ రోడ్డు అధ్వానం

అడుగుకో గొయ్యి.. గజానికో గుంత

- ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని దుస్థితి
- తట్టబంద మీదుగా బస్సులు ఆర్టీసీ ఆపేసిన అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాల ప్రజలు



దాసరియ్యపాలెం వద్ద భారీ గోతులు

రావికమతం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): **రావికమతం నుంచి తట్టబంద మీదుగా తోటకూరపాలెం వెళ్లే (ఆర్ఈసీ) ఆర్అండ్‌బీ రోడ్డు తుఫాన్ వర్షాలకు అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి వాహన చోదకులకు నరకప్రాయంగా మారింది. కొన్నిచోట్ల రోడ్డు మొత్తం భారీ గొయ్యి ఏర్పడి, వర్షం నీటితో చెరువులను తలపిస్తున్నాయి. దీంతో అనకాపల్లి నుంచి తట్టబంద రావికమతం నడిచే బస్సు సర్వీసుల్లో కొన్నింటిని రద్దు చేశారు. మిగిలిన వాటిని గొంప మీదుగా నడుపుతున్నారు. దీంతో తట్టబంద, గుడ్డిప పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.**

అడుగుకో గొయ్యితో బస్సుల కమాన్ కట్టలు నేలకు తగిలి, బస్సు బోల్తా పడే ప్రమాదం ఉందని, ఈ కారణంగా ఆ మార్గంలో బస్సులను నడపలేకపోతున్నాయని ఆర్టీసీ అధికారులు అంటున్నారు. గోతులు పూడ్చే వరకు బస్సులను నడపలేమని సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. తట్టబంద, తోటకూరపాలెం రూట్‌లో ఆర్టీసీ బస్సులు నడవకపోవడంతో అనకాపల్లిలో కళాశాలలకు, మరుపాకలోని మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది విద్యార్థులు తాత్కాలికంగా మానేశారు. ప్రస్తుతం ఈ రోడ్డులో ద్విచక్ర వాహనాలు కూడా నడవడానికి వీలు కాని పరిస్థితి నెలకొంది.



గుడ్డిప గ్రామంలో చెరువును తలపిస్తున్న భారీ గొయ్యి

రావికమతం, బుచ్చెయ్యపేట, మాకవరపాలెం మండలాల్లో సుమారు వంద గ్రామాల ప్రజలు అనకాపల్లి వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. కొంతకాలం నుంచి క్వారీ లారీలు, గ్రానైట్ బండలను రవాణా చేసే భారీ వాహనాలు ఈ మార్గంలో వెళుతుండడం, మరోవైపు గత ప్రభుత్వం ఒక్కఏడాది కూడా నిర్వహణ పనులు చేపట్టక పోవడంతో రోడ్డు మొత్తం ... మిగతా 6వ పేజీలో

ప్రైవేటు ఆలయాలపై దృష్టి

పటిష్ఠ భద్రత, రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వ నిర్ణయం

- సమగ్ర వివరాలు సేకరించాలని జిల్లాల అధికారులకు ఆదేశాలు
- పలు అంశాలతో మార్గదర్శకాలు జారీ
- నేటి నుంచి ఆలయాలను పరిశీలించనున్న దేవదాయ శాఖ సిబ్బంది
- మూడు రోజుల్లో వివరాలు సేకరణ



గ్రామ దేవతల ఉత్సవాల సందర్భంగా ఒక ఆలయం వద్ద భక్తుల రద్దీ (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): **కార్తీకశుద్ధ ఏకాదశి రోజైన శనివారం శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది భక్తులు మృతిచెందిన ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది.. భవిష్యత్తులో మరే ఆలయంలో కూడా ఇటువంటి సంఘటనలు జరగకుండా పటిష్ఠ రక్షణ, భద్రత చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేవదాయ శాఖ పరిధిలో వున్న ఆలయాలతోపాటు ప్రైవేటు వ్యక్తులు, ట్రస్టులు, సంస్థల నిర్వహణలో వున్న ఆలయాల గురించి సమగ్ర వివరాలు సేకరించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, దేవదాయ శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.**

వాస్తవానికి దేవదాయ శాఖ పరిధిలో సిక్స్-ఏ, సిక్స్-బీ, సిక్స్-సీ, సిక్స్-డీ కేటగిరీల్లో వున్న ఆలయాల గురించి మాత్రమే ఆ శాఖ అధికారుల వద్ద పక్కా సమాచారం వుంటుంది. దేవదాయ శాఖ పరిధిలో వున్న ఆలయాల్లో ముఖ్య జాతర్లు, వార్షికోత్సవాలు, కల్యాణోత్సవాలు, బ్రహ్మోత్సవాలు జరిగేటప్పుడు ఈవోలు, జూనియర్/ సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందిని డిప్యూటేషన్‌పై నియమిస్తారు. అవసరమైన క్యూ లైన్లు, ఇతర సదుపాయాలను కల్పిస్తుంటారు. కానీ ప్రైవేటు ఆలయాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఎన్ని వున్నాయనే సమాచారం దేవదాయ శాఖ వద్ద లేదు. ఈ నేపథ్యంలో కాశీబుగ్గలో ఒక ప్రైవేటు వ్యక్తి నిర్వహణలో వున్న ఆలయంలో జరిగిన విషాద ఘటనను పరిగణలోకి తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా వున్న ప్రైవేటు ఆలయాలపై నివేదికలు సిద్ధం చేయాలని మంత్రులు నారా లోకేశ్, ఆనం రామనారాయణరెడ్డి, వంగలపూడి అనిత.. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లకు సూచించారు. అధికారుల ఆదేశాల మేరకు దేవదాయ శాఖ ఈవోలు.. గ్రామాలు, పట్టణాల్లో ప్రైవేటు ఆలయాల వివరాలను సేకరించే పనిలో పడ్డారు. ఏ ఊరులో ఎన్ని ప్రైవేటు గుడులు వున్నాయి? వాటిని ఎవరు నిర్మించారు? ప్రస్తుతం ఎవరు నిర్వహిస్తున్నారు? జాతరలు, ముఖ్యమైన పండుగలు, వార్షికోత్సవాలు ఏయే రోజుల్లో జరుగుతాయి? ఎంతమంది భక్తులు ఈ కార్యక్రమాలకు వస్తుంటారు? ఏటేటా భక్తులు ఎంత మేర పెరుగుతున్నారు? తదితర అంశాలపై సోమవారం నుంచి వివరాలు సేకరించనున్నారు. ఇంకా భక్తులు ఆలయంలోకి వెళ్లే మార్గాలు/ వచ్చే మార్గాలు ఎలా వున్నాయి? బారికేడ్లు/రెయిలింగ్ సామర్థ్యం ఎంత? ఆలయ గర్భగుడిలో ఒకేసారి ఎంతమంది భక్తులు వుండవచ్చు? విద్యుత్ లైన్లు ఎలా వున్నాయి? సీసీ కెమెరాలు వున్నాయా? తదితర ... మిగతా 6వ పేజీలో

జనవరి 28న టీ-20

భారత్, న్యూజిలాండ్ మధ్య క్రికెట్ మ్యాచ్

- వేదిక ఏసీఏ- వీడీసీఏ స్టేడియం



విశాఖపట్నం, స్పోర్ట్సు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మరో టీ -20 మ్యాచ్‌కు విశాఖ ఆతిథ్యమివ్వనుంది. పోతినమల్లయ్యపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో వచ్చే ఏడాది జనవరి 28న న్యూజిభారత్, న్యూజిలాండ్ మధ్య అంతర్జాతీయ టీ20 మ్యాచ్ జరగనుంది. భారత్ పర్యటనలో భాగంగా న్యూజిలాండ్ జట్టు మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్‌కు సంబంధించి జనవరి 21న తొలి టీ20 నాగపూర్, రెండో మ్యాచ్ జనవరి 23న రాయపూర్, మూడో టీ20 జనవరి 25న గువహటి, జనవరి 28న నాల్గో మ్యాచ్ విశాఖలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఆడనున్నారు. దీంతో ఇప్పటివరకు మూడు టెస్టు మ్యాచ్‌లు, పది వన్డే మ్యాచ్‌లు, నాలుగు అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన విశాఖ త్వరలో ఐదో టీ20 మ్యాచ్ నిర్వహణకు సిద్ధమవుతోంది.

ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా గత నెల మహిళల ప్రపంచకప్ టోర్నీలోని ఐదు మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన విశాఖ డిసెంబరు 6న భారత్, దక్షిణాఫ్రికా మధ్య అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌కు సమాయత్తమవుతుండగా, జనవరి 28న భారత్, న్యూజిలాండ్ మధ్య టీ-20 మ్యాచ్ నిర్వహించనుంది.

టెన్త్, ఇంటర్ పరీక్షలకు సన్నాహాలు


- కేంద్రాల ఎంపికలో ఇబ్బందులపై అధికారుల ఆరా!

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై పాఠశాల విద్య, ఇంటర్ బోర్డు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్, మార్చి 16 నుంచి పదో తరతగతి పరీక్షలకు ఇప్పటికే టైమ్‌టేబుల్ విడుదలైంది. ఇంటర్మీడియట్‌లో తొలిసారిగా సీబీఎస్ఈ సిలబస్ ఆధారంగా ప్రశ్నపత్రం రూపొందిస్తుండడంతో పరీక్షలు కూడా ఎక్కువ రోజులు జరగనున్నాయి. ఇప్పటివరకు 12 రోజుల్లో ఇంటర్ పరీక్షలు ... మిగతా 6వ పేజీలో

వాడవాడలా అరకు కాఫీ ఘుమఘుమలు

రద్దీ ప్రదేశాల్లో స్టాళ్లు ఏర్పాటు చేయాలని అధికారుల నిర్ణయం

- పొదుపు సంఘాల మహిళలకు ఉపాధి కల్పన
- 'నేటివ్ అరకు కాఫీ'తో సెర్ప్ ఒప్పందం
- త్వరలో బలిఘట్టంలో కాఫీ స్టాల్





'నేటివ్ అరకు' కాఫీ స్టాల్. (ఇన్‌సెట్‌లో) అరకు కాఫీ పొడి

నర్సీపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా ప్రఖ్యాతి గాంచిన అరకు ఫిల్టర్ కాఫీ ఘుమఘుమలు ఇప్పుడు వాడవాడలా వ్యాపించబోతున్నాయి. పొదుపు సంఘాల మహిళలతో అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేసి వారికి జీవనోపాధిని మరింత మెరుగుపరచడానికి సెర్ప్ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. బాగా రద్దీగా ఉండే ... మిగతా 6వ పేజీలో

మునిసిపల్ కార్మికుల సమ్మె తాత్కాలికంగా వాయిదా

ఎలమంచిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి మునిసిపల్ కార్మికులు నిర్వహించతలపెట్టిన సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు అన్నారు. ఆదివారం ఇక్కడ జరిగిన మునిసిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబరు 3వ తేదీ నుంచి కార్మికుల సమ్మె నిర్వహించాల్సి ఉందని, తుఫాన్ కారణంగా ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర సంఘం తాత్కాలిక వాయిదా వేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 135 మునిసిపాలిటీల్లో సేవలందిస్తున్న కార్మికులకు న్యాయస్థానం తీర్పు మేరకు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు వై.నూకరాజు, సీహెచ్. వెంకటరమణ, డి.మహేష్, జె. వెంకటరమణ, ఎం. నాగరాజు పాల్గొన్నారు.

నేడు రేబాకలో శివాలయం నిర్మాణానికి శంకుస్థాపన

నక్కపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గ్రామంలో కార్తీకమాసం రెండో సోమవారం శివాలయ నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుందని వీహెచ్‌పీ జిల్లా మాజీ అధ్యక్షుడు గొట్టుముక్కల శ్రీహరిరాజు చెప్పారు. ద్వాదశ జ్యోతిర్లింగాలు, పంచారామాలు, పంచభూత లింగాలు సహా మొత్తం 27 శివలింగాలు, పార్వతీ,పరమేశ్వరులతో ప్రధాన ఆలయం, గణపతి, కుమారస్వామి, అయ్యప్పస్వామి తదితర దేవతామూర్తుల విగ్రహాలతో ఈ ఆలయ నిర్మాణం జరుగుతుందని చెప్పారు. సోమవారం ఉదయం వేదపండితుల సమక్షంలో నూతన శివాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని శ్రీహరిరాజు చెప్పారు.

రెల్లివీధిలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

నక్కపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలోని రెల్లికాలనీలో రామాలయానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. రాష్ట్రకాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ నూతన రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాల నిర్మాణంతో ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కాలనీవాసులు, దీక్షాపరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ



తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న టీడీపీ నేత సోమిరెడ్డి రాజు తదితరులు

ఎస్.రాయవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 11 మంది తుఫాన్ బాధితులకు ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యం, నిత్యావసర సరుకులను ఆదివారం టీడీపీ నేత సోమిరెడ్డి రాజు పంపిణీ చేశారు. బాధితులకు 25 కిలోల బియ్యం, నూనె, కందిపప్పు, పంచదార, ఉల్లిపాయలు, బంగాళదుంపలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత బత్తుల సూరన్న పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

మండలంలోని మడుతూరులో తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులను జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి మోటూరు శ్రీవేణి ఆదివారం పంపిణీ చేశారు. ఈ గ్రామంలో తొమ్మిది కుటుంబాలకు పాతిక కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, నూనె కేజీ చొప్పున పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు ఇందల సూరిబాబు, నీరుకొండ సంతోష్, బలిరెడ్డి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

కరువు భత్యం పెంచాలని కార్మికుల ఆందోళన

రాంబిల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కరువు భత్యం పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో రాంబిల్లి, కృష్ణంపాలెం గ్రామాల్లో ఆదివారం కార్మికులు ఆందోళన చేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. దేముడునాయుడు మాట్లాడుతూ కరువు భత్యం పెంచడం వల్ల ప్రభుత్వానికి ఎటువంటి భారం ఉండకపోయినా కార్పొరేట్ కంపెనీలకు లాభాల కోసం ఏ నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి కార్మికులకు కరువు భత్యం పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు శ్రీను, రమణ, నాగేష్,శివ, చిన్న, శంకరరావు, నూకరాజు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు మార్పిడి జరుగుతున్నందున సోమవారం పలు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ ఎస్. రాజశేఖర్, అచ్యుతాపురం ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. వెదురువాడ, గొర్లె ధర్మవరం, మెట్ట ధర్మవరం, లంక ధర్మవరం, మార్టూరు రోడ్డు, సాయిప్రియ లేఅవుట్, జగనన్న కాలనీ, ఆర్ఆర్ కాలనీ, పైడిమాంబ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, వెంకటాపురం జంక్షన్, దిబ్బపాలెం, మోసయ్యపేట, చోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు మోసయ్యపేట, భోగాపురం రోడ్, ఎస్‌టీబీఎల్ కాలనీ, అచ్యుతాపురంలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.


భారీ స్క్రీన్‌పై క్రికెట్ మ్యాచ్ వీక్షించిన నేతలు

ఎలమంచిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణ కార్యాలయంలో ఆదివారం భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి ఇండియా, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న ప్రపంచ మహిళల క్రికెట్ మ్యాచ్‌ను నేతలంతా వీక్షించారు. ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ నేతలు, కార్యకర్తలు అంతా మ్యాచ్‌ను వీక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గొర్లె నానాజీ, ఆడారి ఆదిమూర్తి, రాజాన సూర్యనాగేశ్వరరావు, కరణం రవి, బొద్దపు శ్రీనివాసరావు, మజ్జి రామకృష్ణ, దాడి రమేష్, గొర్లె బాబూరావు పాల్గొన్నారు.

చిన్న గొల్లలపాలెంలో సబ్ రేషన్ డిపో ప్రారంభం

ఎలమంచిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ 22వ వార్డులోని చిన్న గొల్లలపాలెంలో ఆదివారం సబ్ రేషన్ డిపోను టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు రేషన్‌ను తీసుకునేందుకు రెండు కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చేదన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సబ్ రేషన్ డిపో ఏర్పాటు చేయించామన్నారు. కార్యక్రమంలో నేతలు ఎం.రాజుబాబు, చల్ల నూకరాజు, ఎం.రమణ, ఎన్.రమేష్, డీలరు ఎం. లీలమహేష్ పాల్గొన్నారు.

'మత్స్యకారులకు అండగా కూటమి ప్రభుత్వం'



మత్స్యకారులకు నిత్యావసర సరుకులను అందిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు ఎప్పుడూ అండగా ఉంటుందని టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, సర్పంచ్ వంకా వెంకటరమణ అన్నారు. శనివారం వెంకటనగరం, రాజానగరం గ్రామాలలో మత్స్యకార కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం మత్స్యకారులను ఆదుకుంటుందన్నారు.కార్యక్రమంలో శ్రీరాంపురం పీఏసీఎస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు గొర్ల రాజుబాబు, దేవవరపు ఆనంద్, వంకా శివ, వంకా హరి, దారా గాలిబాబు, త్రిమూర్తులు, గరికిన అప్పారావు, బదిన గోపి, గరికిన శ్రీను, మత్స్యకారులు పాల్గొన్నారు.

తుఫాన్‌తో పత్తికి తీవ్ర నష్టం

- వర్షాలకు కుళ్లిన పంట
- కొనుగోలు చేసేందుకు వ్యాపారుల విముఖత
- నష్టపోయిన పత్తి రైతు

కోటవురట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెల్లబంగారం పత్తి పంటపై ప్రకృతి పగబట్టింది. మొంథా తుఫాన్ వర్షాలకు మండలంలో పత్తి పంట దెబ్బతింది. భారీవర్షాలకు పత్తి నల్లబారింది. పంట చేతికి వస్తున్న సమయంలో తుఫాన్ శాపంగా మారిందని రైతాంగం వాపోతోంది. ఆరుగాలం కష్టం నీటిపాలైందని లబోదిబోమంటోంది.

మండలంలో ఈ ఏడాది తిమ్మాపురం, టి.జగ్గంపేట, కే వెంకటాపురం, కొడవటిపూడి, పీకేపల్లి, బోడపాలెం, లింగాపురం, నీలిగుంట, బీకేపల్లి, పీకే పల్లి, ఆక్సాహెబ్‌పేట, చినబొడ్డేపల్లి, పాములవాక, కోటవురట్ల తదితర గ్రామాల్లో 320 ఎకరాల్లో రైతులు పత్తి పంట వేశారు. మొంథా తుఫాన్ వర్షాలకు కాపు కాసిన కాయల్లో నీరు చేరి కుళ్లిపోయాయి. చేలల్లోనే నల్లబారిన కాయలు రాలిపోయాయి. పత్తిలో తేమ శాతం బాగుంటేనే కొనుగోలుకు ముందురాని కుళ్లి పత్తిని అసలు కొనుగోలు చేయడం లేదు. వర్షాలకు ముందు క్వింటా పత్తి ధర రూ.6,200లకు వ్యాపారులు కొనుగోలు చేశారు. వర్షానికి కొంత వరకు తేమశాతం ఉన్న పత్తిని ఎక్కువగా రోజులు నిల్వ ఉంచితే ఆ ధర కూడా రాదన్న ఉద్దేశంతో ఎప్పటికప్పుడు పత్తిని అమ్మేస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారస్తులు కూడా మార్కెట్‌లో ఉన్న రేటుకు సగం ధరకు కొనుగోలు చేస్తామని అంటున్నారు. తీసిన పత్తిని ఆరబెట్టుకుందామంటే నల్లబారి పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది ఎకరాకు 8 నుంచి 10 క్వింటాలు దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. పెట్టుబడి పోయిందని, చివరికి అప్పులు మిగిలాయని రైతులు వాపోతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని పత్తి రైతులు కోరుతున్నారు.



లింగాపురం వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట

పంట దారుణంగా పడిపోయింది

జానకి శివ, కోటవురట్ల



పత్తి పంటను రెండు ఎకరాల్లో సాగు చేశాను ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు రెండు ఎకరా ల్లో పంట నేలపడిపోయింది. రూ.60 వేలు నుంచి రూ.70వేలు పెట్టుబడి పెట్టాను. పంట చేతికి వస్తున్న సమయంలో తుఫాన్ కారణంగా పంట మొత్తంగా పడిపోయింది.

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు

రుత్తల గోవిందు, లింగాపురం



తడిపోయిన పత్తి పంటను వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. కాయల్లో నీరు చేరి కుళ్లిపోయాయి. చేలల్లోనే నల్లబారిన కాయలు రాలిపోయాయి. నల్లబారిన పత్తిని వ్యాపారాలు కొనడం లేదు. పెట్టిన పెట్టుబడి పోయింది.

నేడు మునగపాకలో శూలాల సంబరం

- సంప్రదాయబద్ధంగా కొనసాగింపు

మునగపాక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారం మండల కేంద్రంలో సాంబమూర్తి శూలాలు సంబరం నిర్వహణకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు తెలిపారు. 3వ తేదీ తెల్లవారుజాము నుంచి స్వామివారి దర్శనం ఉంటుందని, రాత్రి పది గంటలకు శూలాలు సంబరం ప్రారంభమై మంగళవారం తెల్లవారుజాము వరకు కొనసాగుతుందన్నారు. తమిళనాడు పళనిలో నిర్వహించే విధంగా ఇక్కడ శూలాల సంబరం నిర్వహిస్తామన్నారు. గ్రామంలోని పల్లపువీధిలో ఉన్న సాంబమూర్తి దేవస్థానం కేంద్రంగా శులాల సంబరం ఏటా నిర్వహిస్తూనే ఉన్నారు. ఇనుప చువ్వలు శరీరానికి ధరించి భక్తులు చేసే నృత్య ప్రదర్శన తన్మయానికి గురిచేస్తోంది. అదేవిధంగా రంగు రంగులు నూలు దారాలు, వెదురు కర్రలతో తయారు చేసిన రెండస్తులు గుమ్మటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. గ్రామంలో ప్రధాన కూడల్లో భారీ స్టేజ్‌లు ఏర్పాటు, విద్యుత్ అలంకరణలు, నేల వేషాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణ కానున్నాయి.



శూలాధారణలో శివ భక్తుడు (ఫైల్‌ఫొటో)

టమాటా రైతును ముంచిన తుఫాన్

- పలు గ్రామాల్లో పంట నాశనం

అచ్యుతాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ మండలంలో టమాటా రైతులను నిండా ముంచేసింది. మండలంలో రామన్నపాలెం మడుతూరు, దోసూరు, రాజానపాలెం, దొప్పెర్ల, నడింపల్లి, సునపర్తి, ఇరువాడ, ఆర్‌రాజాం, చీమలాపల్లి, ఆవసోమవరం, దుప్పితూరు తదితర పంచాయతీల పరిధిలో అత్యధికంగా కూరగాయలను పండిస్తారు. కూరగాయలను అచ్యుతాపురం సంతలో విక్రయిస్తారు. ఇక్కడ ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో కూరగాయల సంత జరుగుతుంది. పక్కనున్న విశాఖపట్నం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి కూడా వ్యాపారులు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తారు. ఈసంవత్సరం కూడా రైతులు భారీగానే కూరగాయల సాగు ప్రారంభించారు. ధర ఆశాజనకంగా ఉంటుందన్న ఉద్దేశంతో ఈ ఏడాది రైతులు టమాటా పంటపైనే ఎక్కువ దృష్టి సారించారు. మొంథా తుఫాన్ రాక ముందు పైరు బాగానే ఉంది. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు ఎడతెరిపి లేకుండా కురియడంతో టమాటా పంట నాశనమైంది. అలాగే వంగ, బీర, బెండ పంటలు కూడా నాశనమయ్యాయని రైతులు తెలిపారు. ఎకరా పొలంలో టమాటా నారు వేయడానికి అన్ని ఖర్చులతో కలిసి సుమారు రూ.లక్ష వరకు ఖర్చయిందని, వారం రోజులు ఆగితే పంట చేతికి వచ్చేదని, తుఫాన్‌తో పంట మొత్తం నాశనమైందని రామన్నపాలెంకి చెందిన రైతు ధర్మిరెడ్డి రాము తెలిపారు. అధికారులు అధికారులు పంటను పరిశీలించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కుళ్లిపోయిన టమాటా మొక్కను చూపుతున్న రైతు రాము

వైసీపీ నేతలు తీరు మార్చుకోవాలి

కాశీబుగ్గ ఆలయ ఘటన దురదృష్టకరం : ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు

ఎలమంచిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ ఆలయ ఘటన విషయంలో కొందరు వైసీపీ నేతలు తీరు మార్చుకోవాలని, ఈ ప్రమాదం జరగడం చాలా దురదృష్టకరమని ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో నిర్వహిస్తున్న ఆలయంలో ఈ ప్రమాదం జరిగిందని, ప్రభుత్వ, దేవదాయ శాఖాధీనంలో కానీ ఆలయ నిర్వహణ లేదన్న విషయాన్ని వైసీపీ నేతలు తెలుసుకోవాలన్నారు. అయినప్పటికీ ప్రమాద ఘటనపై ప్రభుత్వం తక్షణం స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి మెరుగైన వైద్య సేవలు అందించిందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్, మంత్రులు లోకేష్, అనిత, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడులతో పాటు అధికారులు, స్థానిక నేతలు యుద్ధప్రాతిపదికన తీసుకున్న చర్యలు ప్రజలకు తెలుసున్నారు. మృతుల కుటుంబాలకు బాసటగా నిలవాల్సిన సమయంలో వైసీపీ నేతలు విమర్శలు చేయడం బావ్యం కాదన్నారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ ఆలయ ప్రమాదం చాలా దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు బాసటగా నిలవాల్సిన సమయంలో విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి ఆదిమూర్తి, జిల్లా ప్రతినిధి రాజాన సూర్యనాగేశ్వరరావు, కరణం రవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు

కాలు విరిగిన ఆవుకు శస్త్రచికిత్స

అచ్యుతాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ సమయం లో మెట్ట ధర్మవరంలో పెంకె మారేష్‌కి చెందిన ఆవుకు కాలు విరిగిపోయింది. విషయం గోపాలమిత్ర ప్రకాష్ ద్వారా పశువైద్య అధికారులకు తెలియజేయగా పశువైద్యాధికారులు శివకుమార్, శివప్రసాద్ ఆదివారం ఆవు కాలుకి శస్త్రచికిత్స చేశారు.

గండి పూడ్చివేతను పరిశీలించిన ఎమ్మెల్యే



రజాల వద్ద శారదా నది గట్టు పూడ్చివేత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, అధికారులు

రాంబిల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రజాల అగ్రహారం వద్ద మేజర్ శారదా నది గట్టు గండి పూడ్చివేత పనులను ఆదివారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. గట్టు ఎంతమేర పూడ్చారో అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికి 50 శాతం మేర పనులు పూర్తయ్యాయని సంబంధిత అధికారులు తెలిపారు. గండి పూడ్చివేత పనులలో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తిచేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. నదిలో నీటి ఉధృతి పెరిగినా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గట్టును పటిష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ సాయిప్రశాంతి, ఏఈ శివాజీ, కూటమి నేతలు వి.దిన్‌బాబు, బద్ది ఈశ్వరరావు, కర్రిసింహగిరి ప్రసాద్, చోడిపల్లి సత్యనారాయణ, ఉమ్మిడి నాగేష్ తదితర నేతలు, రైతులు పాల్గొన్నారు.

నేడు హోం మంత్రి వినతుల స్వీకరణ

నక్కపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ చెప్పారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, అమలాపురం సర్పంచ్ పెదపూడి శంకరరావు, ఉప సర్పంచ్ నర్సింగరావు, ఎరుపిల్లి అప్పలరాజు, ఎస్.గోవింద్ పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న కొప్పిశెట్టి వెంకటేశ్

ఘనంగా భగీరథి అమ్మవారి నెల పండుగ

అచ్యుతాపురం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపాలెం-అందలాపల్లిలోని భగీరథి అమ్మవారి నెల పండుగ ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నెల పండుగలో భాగంగా మహిళా భక్తులు ఘటాలను నెత్తిన పెట్టుకుని హరిపాలెం, అందలాపల్లి గ్రామాలలో ఊరేగించారు. సంప్రదాయ నృత్యాలు, కళాకారుల వాయిద్యాలతో ఘటాలను ఊరేగించారు. అనంతరం భగీరథి అమ్మవారి ఆలయం వరకూ ఊరేగింపుగా వెళ్లి ఘటాలను దించి, ప్రత్యేక పూజలు ఆచరించారు.



కోలాటాలతో భగీరథి అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

ఉత్సాహంగా హ్యాపీ సండే

- విజేతలకు బహుమతులు పంపిణీ

ఎలమంచిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను అధిగమించేందుకు నిరంతరం కృషి చేయాలని మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు సూచించారు. ఆదివారం మునిసిపాలిటీ కాకివానివీధిలో విద్యార్థులకు హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులంతా తల్లిదండ్రులు, పెద్దలతో గౌరవప్రదంగా నడుచుకోవాలన్నారు. మునిసిపల్ వైస్ చైర్మన్ ఆరెపు గుప్తా మాట్లాడుతూ విద్యారంగంలో రాణించాలంగటే నిత్యం పుస్తక పఠనం చేయాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కట్టమూరి సుజాత, సీరాసాయి ప్రసన్న చిరంజీవి, కూటమి నేతలు చిన్నారావు, హరి, యల్లపు శేషు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అరకు కాఫీ ఘుమఘుమలు

... 5వ పేజీ తరువాయి

ప్రదేశాలలో స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా సెర్ప్ అధికారులు నేటివ్ సంస్థలో ఒప్పందం చేసుకున్నారు. ఒక్కొక్క యూనిట్‌కు రూ.5.9 లక్షలు అవసరమని గుర్తించారు. పీఎంఎఫ్‌ఎంఈ పథకం ద్వారా రూ.4.02 లక్షలు రుణం ఇచ్చి 35 శాతం రాయితీ మంజూరు చేస్తారు. మిగిలిన పెట్టుబడికి స్త్రీనిధి నుంచి రుణం ఇస్తారు. తొలుత నర్సీపట్నం, పాయకరావుపేట, అనకాపల్లి, చోడవరం, ఎస్.రాయవరంలో పెట్టాలని అధికారులు ప్రతిపాదించారు. ముందుగా నర్సీపట్నం మండలం అమలాపురానికి చెందిన ఎస్‌హెచ్‌జీ మహిళకు యూనిట్ మంజూరు చేశారు. శారదానగర్ మెయిన్ రోడ్డు నుంచి బలిఘట్టం వెళ్లే మలుపులో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేస్తారు. అమ్మకాలు అధికంగా జరిగే రద్దీ ప్రదేశాలలో కాఫీ స్టాల్స్ పెట్టుకోవాలని సూచిస్తున్నారు. పొదుపు సంఘాల నుంచి స్టాల్స్ పెట్టుకోవడానికి ముందుకు వస్తే ప్రోత్సహిస్తామని వెలుగు డీపీఎం సత్యనారాయణ తెలిపారు.

ఆర్ఈసీ రోడ్డు అధ్వానం

... 5వ పేజీ తరువాయి

ఛిద్రమైంది. అడుగడుగునా గోతులు ఏర్పడి దారు ణంగా తయారైంది. కొన్నిచోట్ల భారీ వాహనాలు గోతుల్లో కూరుకుపోవడంతో ట్రాఫిక్ స్తంభిస్తున్నది. ఇటువంటి సమయంలో పురుటి నొప్పులు వచ్చిన గర్భిణులను ఆస్పత్రికి తరలించడానికి కుటుంబ సభ్యులు నానాపాట్లు పడాల్సి వస్తున్నది. గోతుల వద్ద వాహనం కుదుపులకు దారిలోనే ప్రసవం అవుతుందా? అన్నట్టుగా పరిస్థితి వుంటుంది. ఈ రోడ్డు అభివృద్ధి గురించి ఆర్అండ్‌బీ జేఈ సాయిశ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. అభి వృద్ధి పనులకు రూ.3 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదించామని, నిధులు మంజూరైన వెంటనే టెండర్లు పిలిచి పనులు మొదలుపెడతామని చెప్పారు.

స్టీల్‌ప్లాంట్‌కు మార్గం సుగమం

... 5వ పేజీ తరువాయి

ఉత్పత్తుల ఎగుమతి) డీఎల్ పురం సముద్ర తీరంలో పోర్టును నిర్మించనున్నారు. ఇందుకు 128 ఎకరాల భూమి అవసరమని ప్రభుత్వాన్ని కోరాయి. ఇంకా నక్కపల్లి మండలం గుల్లిపాడు రైల్వేస్టేషన్ నుంచి స్టీల్‌ప్లాంటు వరకు కొత్తగా రైల్వేట్రాక్ నిర్మించాలన్న ప్రతిపాదన కూడా వుంది. మిట్టల్- నిప్పన్ స్టీల్స్‌లో 63 వేల మందికి ఉద్యోగ, ఉపాధి లభిస్తాయని భావిస్తున్నారు. స్టీల్‌ప్లాంటుకు అనుబంధంగా ఏర్పాటయ్యే చిన్నమధ్య తరహా పరిశ్రమల్లో వేలాది మందికి ఉపాధి లభిస్తుంది.

మౌలిక వసతుల పనులు మొదలు

నక్కపల్లి మండలంలో నిర్మాణం కానున్న స్టీల్‌ప్లాంట్‌కు మౌలిక సదుపాయాల కల్పన పనులు మొదలయ్యాయి. స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన నీటిని ఏలేరు లేదా పోలవరం ఎడమ కాలువల నుంచి సరఫరా చేస్తారని తెలిసింది. ఇందుకు కోసం పైపులైన్ వేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. 1100 మి.మీ.ల వ్యాసార్థంగల భారీ పైపులను వెదుళ్లపాలెం, సీహెచ్‌బీ అగ్రహారం గ్రామాల వద్దకు చేరుస్తున్నారు.

తుఫాన్ నష్టంపై త్వరలో నివేదిక

... 5వ పేజీ తరువాయి

ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా భోగాపురంలో మహిళా రైతులు మంత్రిని కలిసి, నది గట్టుకు కోతకు గురైన ప్రదేశంలో రక్షణ గోడను నిర్మించాలని, లేకపోతే భవిష్యత్తులో గండి పడి తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెప్పారు. రక్షణ గోడ ఆవశ్యకతను ఎమ్మెల్యే రాజు కూడా మంత్రికి వివరించారు. రాయపురాజుపేటలో ఎర్రిగెడ్డపై వంతెన, రోడ్డు నిర్మాణం, ఊరగెడ్డపై వంతెన నిర్మాణం చేపడితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే వివరించారు.

బీఎన్ రోడ్డు పనులు నెల రోజుల్లో ప్రారంభం

చోడవరం నియోజకవర్గం పరిధిలో దెబ్బతిన్న బీఎన్ రోడ్డు పనులను నెల రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని మంత్రి రవీంద్ర తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడామని, ఆర్థిక శాఖ క్లియరెన్స్‌కు సంబంధించి నెలకొన్న సమస్యపై చర్చించామని, వీలైనంత త్వరలో ఈ పనులు ప్రారంభం కావడానికి అవకాశం ఉందని చెప్పారు. మంత్రి వెంట టీడీపీ నాయకులు మల్లునాయుడు, పెదబాబు, పూతి కోటేశ్వరరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, మత్స్యరాజు, పల్లా అర్జున్, రామునాయుడు, సకురు కోటేశ్వరరావు, భోగాపురం రాము, కొట్టాపు చిన్న, నేమాల హరి వున్నారు.

ప్రైవేటు ఆలయాలపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

అంశాలపైనా సమగ్ర నివేదికలను రూపొందించి సంబంధిత అసిస్టెంట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు అందజేయాలి. ప్రైవేటు ఆలయాల వివరాలు సేకరించేటప్పుడు ఆలయ భౌగోళిక పరిస్థితులను పరిశీలించడంతోపాటు ఇతర వివరాలను సేకరించడంలో తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్ఐలను సమన్వయపర్చుకోవాలని సూచించారు. ఈ సమాచారం ఆధారంగా ఉత్సవాలు, భక్తుల రద్దీ అధికంగా వుండే రోజుల్లో కాశీబుగ్గ లాంటి దుర్ఘటనలు జరగకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టే యోచనలో ప్రభుత్వం వుంది. ఆయ ఉత్సవాలు జరిగే రోజుల్లో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ ఆదేశాలపై దేవదాయ శాఖ విశాఖ జోన్ డిప్యూటీ కమిషనర్ సుజాతను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. ప్రైవేటు ఆలయాల స్థితిగతులు, భద్రతా ఏర్పాట్లపై అసిస్టెంట్ కమిషనర్లకు సూచనలిచ్చామని, మూడు రోజుల్లో అన్ని ఆలయాల సమాచారాన్ని సేకరిస్తామని చెప్పారు.

టెన్త్, ఇంటర్ పరీక్షలకు సన్నాహాలు

... 5వ పేజీ తరువాయి

నిర్వహించేవారు. ఈ పర్యాయం సీబీఎస్ఈలో రోజుకు ఒక పరీక్ష మాత్రమే నిర్వహిస్తారు. గతంలో ఇంటర్మీడియట్‌లో ఒక రోజు సైన్స్ ఆర్ట్స్ కోర్సులకు సంబంధించి పరీక్షలు నిర్వహించేవారు. ఉదాహరణకు గణితం, అర్థశాస్త్రం పరీక్ష ఒకే రోజు ఉండేది. సీబీఎస్ఈలో గణితం పరీక్ష నిర్వహించే రోజు మరే సబ్జెక్టు పరీక్ష ఉండదు. అందువల్ల 23 రోజులపాటు నిర్వహిస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఇంటర్ పరీక్షలు ముగియకముందే పదోతరగతి పరీక్షలు ప్రారంభమవుతాయి. అందువల్ల కేంద్రాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని ఇరుశాఖల అధికారులు నిర్ణయించారు. జూనియర్ కళాశాలలను ఇంటర్ పరీక్ష కేంద్రాలుగా, పాఠశాలలను పదోతరగతి పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేస్తున్నందున ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడైనా సమస్య తలెత్తే అవకాశం ఉందా అనేదానిపై ఇరు శాఖల అధికారులు సమావేశమై చర్చించారు.

నూకాంబిక ఆలయంలో భక్తుల కోలాహలం

అనకాపల్లి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. వేకువజామున అర్చకులు బాలాలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దర్శనాలు కల్పించారు. సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తూనే ఉన్నారు. కుటుంబాలతో విచ్చేసిన పలువురు ఆలయ పరిసరాల్లో వంటలు వండుకుని నైవేద్యంగా సమర్పించిన అనంతరం ఆరగించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు విధులు నిర్వహించారు


బాలాలయంలో అమ్మవారు


క్యూలైన్లలో నూకాంబికను దర్శించుకుంటున్న భక్తులు

కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మెయిన్ రోడ్డులో గల కన్యకా పరమేశ్వరి దేవస్థానం నూతన కార్యవర్గం శనివారం రాత్రి ఎన్నికైంది. నూతన అధ్యక్షుడుగా వుప్పల రవిరామ్ జవహర్, ఉపాధ్యక్షులుగా గ్రంధి శేషకుమార్, కార్యదర్శిగా శ్రీధరాల సోమరాజు, జాయింట్ సెక్రటరీగా తాటికొండ నూకయ్యశెట్టి, కోశాధికారిగా కడిమిశెట్టి అచ్యుత రామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్‌గా గ్రంధి వీవీఎస్ మాణిక్యంతో పాటు మరో పదకొండు మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరితో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బిళ్లపాటి కృష్ణకుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు.

ఆలయాల అభివృద్ధికి దాతల విరాళాలు

పరవాడ/కశింకోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పరవాడ మండలం ఈ.బోనంగి ఫార్మా పునరావాసకాలనీ కొండపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామగోవిందరావుకు ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు హరికృష్ణమాచార్యులు, మేడిశెట్టి అప్పారావు, ధనరాజు, సీహెచ్.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కశింకోట మండలం గొబ్బూరులో నూతనంగా నిర్మిస్తున్న తలుపులమ్మఆలయంలో విగ్రహం ఏర్పాటుకు అచ్చెర్ల, నర్సింగబిల్లి, గొబ్బూరు, నరసింగబిల్లి గ్రామాలకు చెందిన భక్తులు విరాళం ఇచ్చారు. ఈమేరకు ఆ నగదు ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.


చైర్మన్ రామగోవిందరావుకు విరాళం అందిస్తున్న దాతలు

'కాశీబుగ్గ' మృతులకు కొవ్వొత్తులతో నివాళి


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీవారి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో మృతులకు సంతాప సూచికంగా వైసీపీ నాయకులు ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని రింగురోడ్డులో గల వైసీపీ కార్యాలయం నుంచి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, పట్టణశాఖ అధ్యక్షుడు మంద పాటి జానకిరామరాజు, మలసాల కిశోర్, దంతులూరి శ్రీధర్‌రాజు పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

▸▸ పరవాడలో ఘటన ▸▸ ఈ ఏడాది ఆగస్టు 8న వివాహం

పరవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపంతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం ఇక్కడ చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలివి. పరవాడకు చెందిన గండి వెంకట రాఘవ, ప్రసన్న గౌరీ (29) భార్యాభర్తలు. రాఘవ ఫుట్‌వేర్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు. భార్య ప్రసన్న టెట్ కోసం ప్రిపేర్ అవుతోంది. ఆదివారం ఉదయం టిఫిన్ ముగించుకొని ఆమె ఇంటి రెండో అంతస్తులోకి చదువుకోవడం కోసం వెళ్లింది. మధ్యాహ్నం ఒంటి గంటకు భార్యను భోజనానికి పిలవడం కోసం పైకి వెళ్లి బెడ్ రూమ్ తలుపు కొట్టగా తీయలేదు. విషయాన్ని రాఘవ తల్లిదండ్రులకు చెప్పడంతో వారు కూడా తలుపు కొట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో తలుపును పగులకొట్టి లోపలకి వెళ్లి చూసేసరికి చీరతో ఫ్యాన్ ఉక్కుకు ఉరి వేసుకొని వేలాడుతూ ప్రసన్న విగతజీవిగా కనిపించింది. ఈ ఏడాది ఆగస్టు ఎనిమిదవ తేదీన రాఘవతో ప్రసన్నకు వివాహమైంది. ఉద్యోగం చేయాలనే కోరిక బలంగా ఉండేదని, వివాహమయ్యాక ఆ కోరిక తీరదేమోనన్న భయంతో మనస్థాపం చెంది తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చునని మృతురాలి తల్లి గొర్లి వరలక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


ప్రసన్న గౌరీ (ఫైల్)

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

గజానికో గండం!

▸▸ దారుణంగా అసకపల్లి- లంకెలపాలెం రోడ్డు ▸▸ మూడు కిలో మీటర్ల మేర గోతులమయం

▸▸ భారీ వాహనాల వల్లే ఈ దుస్థితని జనం ఆగ్రహం ▸▸ మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు


పైడివాడ అగ్రహారం వద్ద రోడ్డు దుస్థితి

సబ్బవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అసకపల్లి-లంకెలపాలెం రహదారి అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ గుంతలమయం కావడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసకపల్లి నుంచి పైడివాడ అగ్రహారం వరకూ మూడు కిలో మీటర్ల మేర రోడ్డు మరింత దారుణంగా ఉంటుంది. గతంలో ఈ రోడ్డుపై గుంతలను స్థానికులు గ్రావెల్ తదితరాలు వేసి పూడ్చారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరింత దుర్భరంగా తయారైందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో ప్రయాణం అంటేనే హడలిపోతున్నారు. పరవాడ ఫార్మాసిటీ, ఎన్టీపీసీ నుంచి బూడిద, బొగ్గుతో భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుండడం వల్లే రోడ్డు ఇంత దుర్భరంగా మారిందని అంటున్నారు. వాహనాలు రోడ్డుపై వెళ్లేటప్పుడు బుగ్గిపైకి ఎగిరి కళ్లలో పడుతుండడంతో పాటు దుమ్ము, ధూళి అధికమైందని అంటున్నారు. గడిచిన నాలుగైదేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని చెపుతున్నారు. వర్షాల తరువాత రోడ్డుకు మరమ్మతులు చేపడతామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెపుతుండడమే తప్ప కార్యరూపం దాల్చడం లేదు. ప్రస్తుతం వర్షాలు తగ్గిన నేపథ్యంలో ఇప్పటికైనా స్పందించి ప్రత్యేక దృష్టి సారించాలని అసకపల్లి, ఎరుకునాయుడుపాలెం, పైడివాడఅగ్రహారం గ్రామాల ప్రజలతో పాటు పలువురు వాహనచోదకులు కోరుతున్నారు.

జలగలమదుం జంక్షన్‌లో...


అనకాపల్లిలో జలగల మదుం జంక్షన్ ముందు దెబ్బతిన్న రహదారి


అసకపల్లి గ్రామం సమీపంలో...

అనకాపల్లి టౌన్ : జిల్లా కేంద్రం అనకాపల్లి నుంచి విశాఖకు వెళ్లే మార్గంలోని జలగలమదుం జంక్షన్ వద్ద రహదారి దెబ్బతింది. రోడ్డు మధ్యలో భారీగా గోతులు ఏర్పడటంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనకాపల్లి-విశాఖపట్నం మధ్య నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా ఈ మార్గంలోనే పలు ప్రభుత్వ కార్యాలయాలు, పలు గ్రామాలు ఉన్నాయి. అనకాపల్లి పట్టణం నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే ఇదే అతి ప్రధానమైన మార్గం. అలాగే కొప్పాక, కేఎన్‌ఆర్ పేట, రాజుపాలెం, వల్లూరు, సిరసపల్లి గ్రామాల ప్రజలతో పాటు లంకెలపాలెం ప్రాంతాల నుంచి వివిధ పనులపై అనకాపల్లి పట్టణానికి వచ్చి వెళ్లాలంటే ఇదే ప్రధానమైన మార్గం. ఇంతటి ప్రాధాన్యం గల రోడ్డు పాడైనా అధికారుల్లో స్పందన లేకపోవడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే గోతుల్లో పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనచోదకులు అంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి పాడైన రహదారికి మరమ్మతులు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

ఉద్యోగులు, పింఛనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

▸▸ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

కొత్తూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల టెట్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు తెలిపారు. పట్టణంలో ఆదివారం జరిగిన పలు కార్యక్రమాలకు హాజరైన ఆయన మాట్లాడుతూ సీనియర్ ఉపాధ్యాయులను టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) నుంచి మినహాయించాలని రాష్ట్రంలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ సభ్యులంతా కలిసి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరామన్నారు. సమస్య పరిష్కారానికి ఉన్న అవకాశాలన్నీ ఆయన పరిశీలిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం కాగితాలపై ఇచ్చి వెళ్లిపోయిన డీఏ ఉత్తర్వులకు కూటమి అధికారంలోకి వచ్చాక నగదు రూపంలో చెల్లించిందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లకు జీతాలు, పింఛన్లు చెల్లించి వారి ఆత్మాభిమానాన్ని కాపాడాలని ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినప్పటికీ నేరుగా ముఖ్యమంత్రి అన్ని ఉద్యోగ సంఘ నాయకులతో చర్చల్లో పాల్గొని ఒక డీఏను మంజూరు చేయడంతో పాటు వెంటనే అమలులోకి తెచ్చారన్నారు. అలాగే డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకం చేపట్టారన్నారు. ముందుగా ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు చిరంజీవిరావుకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంపాల వెంకటరమణ, రాష్ట్ర కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు కోట్ని రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొనాన్నరు.


ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

భోగలింగేశ్వరుని ఆలయంలో గోపూజ


గోమాతకు పూజ చేస్తున్న భక్తుడుల

అనకాపల్లి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం కోట మీద గల భోగలింగేశ్వరుని ఆలయంలో కార్తీకమాసం ద్వాదశి సందర్భంగా ఆదివారం గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్యతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో బి.మురళీకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన


వృద్ధుడికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు

అనకాపల్లి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోటలో ఆదివారం నాగేంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దొడ్డి వెంకట సత్యనారాయణ, యల్లపు సత్యనారాయణ ప్రోత్సాహంతో ఏర్పాటైన ఈ శిబిరంలో పలువురు వైద్య నిపుణులు రోగులకు పరీక్షలు జరిపి, మందులు అందజేశారు. కంటి పరీక్షలకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బొడ్డేడ రోషన్‌కుమార్, మద్దాల క్రాంతికుమార్, యల్లపు గోవింద, ఆళ్ల శ్రీరామచంద్రమూర్తి, కొణతాల భాస్కర్, కొణతాల జయబాబు, మద్దాల కృష్ణారావు, పీలా రమణారావు, రాపేటి శ్రీనివాసరావు, కొణతాల శ్రీనివాసరావు, దాడి భాస్కరరావు, పీవీ జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

'కరువు భత్యం సాధన పోరాటానికి సిద్ధం కావాలి'

అనకాపల్లి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కరువు భత్యం సాధనకు కార్మికులంతా పోరాటానికి సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఇక్కడి యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గత ఆరు మాసాలకు సంబంధించిన కరువు భత్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం సున్నాగా ప్రకటించిందన్నారు. కనీస వేతన చట్టం ప్రకారం ప్రతి ఐదేళ్లకు పెంచవలసిన కనీస వేతనం పెంచడం లేదన్నారు. కనీస వేతనం, డీఏ పెంచకపోతే కార్మికుల వేతనం అంతంత మాత్రంగా ఉంటుందదని వివరించారు. ఈ తరుణంలో కార్మికుల కరువు భత్యం సాధనకు చేపట్టబోయే పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాలు ఆడుతున్న ఇద్దరి అరెస్టు

కొత్తూరు, నవంబరు 2 ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం వెంకుపాలెంలో కోడిపందాలు ఆడుతున్న ఇద్దరిని ఆదివారం అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కొత్తూరు ప్రాంతానికి చెందిన బూడిద సాయి, వెంకుపాలెం గ్రామానికి చెందిన బండి పరదేశినాయుడు అనే ఇద్దరు కోడి పందాలు ఆడుతుండగా పట్టుకున్నామన్నారు. వీరి నుంచి నగదు, కోడి పుంజులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

శివాలయాల వద్ద పటిష్ఠ భద్రత : ఎస్పీ

అనకాపల్లి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్న సందర్భంగా భద్రతా చర్యలు చేపట్టినట్టు ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా భక్తుల భద్రత కోసం ప్రత్యేక పర్యవేక్షణకు బృందాలను నియమించామని, ప్రధాన శివాలయాల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సముద్రతీర ప్రాంతాలు, ప్రధాన నది తీరాల్లో బందోబస్తు ఉంటుందని వివరించారు.


తుహిన్ సిన్హా

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


శారదానది గట్టుపై మొక్కలు నాటుతున్న గ్రీన్ క్లబ్ సభ్యులు

అనకాపల్లి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ అన్నారు. ఆదివారం క్లబ్ ఆధ్వర్యంలో శారదానది రక్షణ గట్టు పొడువున వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిచోట పచ్చదనం నిండి ఉంటే కాలుష్య సమస్య ఉండదన్నారు. ప్రతి ఒక్కరూ తన జన్మదినం రోజున మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. అలాగే, పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తే వ్యాధులు దరిచేరవన్నారు. వర్షాలు కుస్తున్న నేపథ్యంలో అంటు వ్యాధుల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తాతయ్యబాబు కుమారుడి రిసెప్షన్‌కు పలువురు ప్రముఖులు

▸▸ మంత్రులు కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత హాజరు

▸▸ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల రాకతో వడ్డాదిలో సందడి


వంశీ, పూజిత దంపతులతో హోం మంత్రి అనిత, పక్కన తాతయ్యబాబు


వధూవరులకు బొకే అందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

బుచ్చెయ్యపేట నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు కుమారుడి వివాహ రిసెప్షన్‌కు ప్రముఖులు తరలివచ్చారు. మండలంలోని వడ్డాది గ్రామంలో తాతయ్యబాబు కుమారుడు వంశీ, పూజిత దంపతులకు ఆదివారం రిసెప్షన్ నిర్వహించారు. ఈ వేడుకకు వివిధ ప్రాంతాల నుంచి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, భూగర్భ, గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, సుందరపు విజయకుమార్, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, అవంతి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, గిడ్డి ఈశ్వరి, స్టేట్ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీతో పాటు పలువురు ప్రముఖులు, వివిధ ప్రాంతాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ప్రముఖుల రాకతో వడ్డాది సందడిగా మారింది.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు అందజేత

కొత్తూరు/ అనకాపల్లి రూరల్/కశింకోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. అనకాపల్లి మండలం సుందరయ్యపేట, వేటజంగాలపాలెం, శంకరం, రేబాక, గొలగాం, గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం, అలాగే, మండల కేంద్రం కశింకోట, బయ్యవరం, జమాదులపాలెం, సుందరయ్యపేట, కన్నూరుపాలెం, తీడ, వై.తుని గ్రామాల్లో గల పలువురికి ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విజయవంతంగా కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి వెంకట సన్యాసినాయుడు, ఏఎంసీ చైర్మన్ పచ్చికూర రాము, టీడీపీ నాయకులు కడిమి గణేష్, చందక నర్సింగ్, గోవింద, ప్రకాష్, తలారి కాశీనాయుడు, బొండా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.


సీఎం సహాయ నిధి మంజూరు పత్రం అందిస్తున్న పీలా గోవింద

సముద్రంలో గల్లంతైన విద్యార్థి మృతి

▸▸ ముత్యాలమ్మపాలెం తీరానికి కొట్టుకొచ్చిన మృతదేహం

పరవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో స్నానం చేసేందుకు వెళ్లి గల్లంతైన విద్యార్థి సూరెడ్డి భాను ప్రసాద్ (15) మృతి చెందాడు. తానాం ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహానికి చెందిన ఐదు గురు విద్యార్థులు కలిసి శనివారం సముద్రంలో స్నానం చే స్తుండగా పెద్ద అల తాకిడికి ఐదుగురు లోపలకి కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. వీరిలో రావికమతం మండలం తోటకూరపాలేనికి చెందిన భానుప్రసాద్ గల్లంతు కాగా, మిగితా నలుగురిని మత్స్యకారులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఇదిలావుంటే, భానుప్రసాద్ మృతదేహం ఆదివారం తెల్లవారుజామున ముత్యాలమ్మపాలెం తీరానికి కొట్టుకొచ్చింది. మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని తండ్రి పెంటయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.విజయకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


భానుప్రసాద్ (ఫైల్)

యువకుడిని గాయపర్చిన వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడ్ని చాకుతో తీవ్రంగా గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. ఇక్కడి తాకాశి వీధికి చెందిన సిరిగిరిశెట్టి హర్షవర్ధన్‌ను అదే ప్రాంతానికి చెందిన కందికొండ వినయ్ అనే యువకుడు గత నెల 31వ తేదీ రాత్రి చాకుతో దాడి చేసి కడుపులో పొడవడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో వినయ్ మెసేజ్‌లు పెట్టడంతో హర్షవర్ధన్ మందలించాడు. దీనిని అవమానంగా భావించిన వినయ్ శుక్రవారం రాత్రి కుమ్మరి వీధిలో హర్షవర్ధన్‌తో గొడవకు దిగాడు. స్థానికులు వీరిరువురినీ మందలించి అక్కడి నుంచి పంపేశారు. అయితే తాకాశివీధి నూకాలమ్మ గుడి వద్ద ఉన్న హర్షవర్ధన్‌పై అదే రోజు రాత్రి వినయ్ చాకుతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడని ఎస్ఐ చెప్పారు. తీవ్ర గాయాలకు గురైన అతనిని కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుడు తండ్రి చంద్రరావు శనివారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శెట్టి నాగరాజు

పాడేరురూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు శెట్టి నాగరాజు అన్నారు. ఆదివారం నిర్వహించిన గిరిజన ప్రాంత వైద్య ఉద్యోగుల జిల్లా సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. వైద్య శాఖలో రెగ్యులర్ ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. వీటిని మండలాల వారీగా సమస్యలను సేకరించి అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అన్ని కేడర్‌ల ఉద్యోగులతో కమిటీ ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. రెగ్యులర్ ఉద్యోగుల సర్వీస్ రిజిష్టర్ల అప్‌డేట్, ఇంక్రిమెంట్, ఫీల్డ్ ట్రావెలింగ్స్ యూనిఫాం అలవెన్స్, ప్రమోషన్‌లు, అధికారుల వేధింపులు తదితర సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో పాడేరు డివిజన్‌లోని 11 మండలాలకు చెందిన మండల అధ్యక్ష, కార్యదర్శులు పడాల్, దేవి నాయుడు, సత్యనారాయణ, ము రళి, మత్స్యలింగం నాయుడు, మోహనరావు పాల్గొన్నారు.

సమ్మెకు కాఫీ కార్మికులు సన్నద్ధం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్



కాఫీ కార్మికులతో మాట్లాడుతున్న చిన్నయ్య పడాల్

చింతపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ పరిధిలోని 11 మండలాల ఏపీఎఫ్‌డీసీ కాఫీ కార్మికులు సమ్మెకు సన్నద్ధమవుతున్నట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. ఆదివారం మండలంలోని కిన్నెర్ల కాఫీ తోటల్లో కార్మికులతో చర్చించారు. ఈసందర్భంగా చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ ఏపీఎఫ్‌డీసీ కాఫీ తోటల్లో పనులు చేస్తున్న కార్మికుల సమస్యలపై యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చి 20 రోజులు కావస్తోందన్నారు. నోటీసు అందుకున్న యాజమాన్యం కనీసం స్పందించడంలేదన్నారు. అలాగే, ఏపీఎఫ్‌డీసీ కాఫీ తోటలు అంతరించిపోతున్నా సంరక్షణకు సంస్థ దృష్టి సారించలేదన్నారు. కాఫీ కార్మికుల సమస్యలపై సంస్థ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని, లేదంటే ఈనెల ఆరో తేదీ నుంచి సమ్మె చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు బాలకృష్ణ, రాములమ్మ, లక్ష్మి, సుబ్బమ్మ, రోహిణి, రామారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



బట్టపణుకులలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రసాద్

కొయ్యూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలో బట్టపణుకులలో రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించనున్న పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాని సర్పంచ్‌తో కలసి ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో నిర్వీర్యమైన పంచాయతీల పాలనను గాడి పెట్టాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన సాగిస్తోందన్నారు. పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టికి చర్యలు తీసుకుందన్నారు. ప్రజా సంక్షేమానికి పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు రంజిత్ కుమార్, శ్రీను, సాయిరమణ, పొత్తూరు సత్తిబాబు సర్పంచ్ బాలకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కాకురు చంద్రరావు, వుండా నాగేశ్వరావు జేఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి వైసీపీ కార్యకర్తలు



జనసేనలో చేరిన బలపం గ్రామ వైసీపీ కార్యకర్తలు

చింతపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివారు బలపం పంచాయతీకి చెందిన వైసీపీ కార్యకర్తలు జనసేనలో చేరినట్టు ఆ పార్టీ మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు తెలిపారు. ఆదివారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో వైసీపీ కార్యకర్తలకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మిరెడ్డి శివ శంకర్ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ బలపం పంచాయతీని అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ పట్టించుకోకపోవడంతో అసంతృప్తి చెందిన ఆ పార్టీ నేతలు జనసేనలో చేరారన్నారు. బలపం వైసీపీ వార్డు సభ్యుడు పాంగి లింగరావు, నాయకులు సిందేరి సోమరాజు, కొర్ర రంగారావు, సాగిన వెంకట రమణ, చిన్నయ్య, పాలికి శ్రీను, కొర్రరాజుబాబు, వంతల సుబ్బారావు, రమణ, కామేశ్, జి. కోటి పార్టీలో చేరారన్నారు.

అసంపూర్తి నిర్మాణాలతో అవస్థలు

- గత ప్రభుత్వంలో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణాలు సక్రమంగా చేపట్టక ఇబ్బందులు
- అరకొర వసతుల మధ్య బాలల విద్యాభ్యాసం



అసంపూర్తిగా వదిలేసిన రేకుల గదిలో చిన్నారులు

అనంతగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం పంచాయతీ సారగూడ గ్రామంలోనిప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం అధ్వాన స్థితికి చేరడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో 40 మంది



పాఠశాల బయట పరిస్థితి

వరకు చదువుతున్నారు. అయితే, గత వైసీపీ పాలనలో పాఠశాల భవనం మరమ్మతులు, ఇతర పనులు నిమిత్తం సుమారు రూ.12 లక్షల వరకు మంజూరయ్యాయి. అయితే, ఆ పనులు సక్రమంగా చేపట్టక విద్యార్థులు నరకం చూస్తున్నారంటూ సామాజిక మాధ్యమంలో (వాటప్స్ గ్రూపులో)తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ వైరింగ్ సరిగా చేయలేదని, పైనా రేకులపై పిట్టగోడ లు నిర్మించలేదని, పనులు అసంపూర్తిగా ఉండిపోయినట్టు గ్రామస్థులు, పెసా కమిటీ అధ్యక్షుడు సోమేల మధు, స్కూల్ కమిటీ చైర్మన్ సోమెల రాము, సోమేల సం జీవరావు, జన్ని అప్పన్న, జన్ని బుద్రయ్య తదితరులు వాపోయారు. ఈ సమస్యలపై ఎంఈవో-1 కిల్లో బాలాజీని వివరణ కోరగా.. పాఠశాల సందర్శిస్తామన్నారు. అసంపూర్తి నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు.

పదవికి వన్నె తెచ్చిన నేత నూకరాజు

- సంతాప సభలో వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్

కొయ్యూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తనను గెలిపించిన ప్రజలకు న్యాయం చేస్తూ దివంగత నేత వారా నూకరాజు పదవికి వన్నె తెచ్చారని, ఆయన లేనిలోటు తీర్చలేనిదని వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. భూ సంబంధిత తగాదాలతో దీపావళి రోజు హత్యకులోనైన కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు సంతాప సభను ఆదివారం ఆయన స్వ గ్రామమైన చిట్టింపాడులో కుటుంబీకులు, పార్టీ నేతలు, అభిమానులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అమర్‌నాథ్ పాల్గొని నూకరాజు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు బిడజాన అప్పారావు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో మాజీ మంత్రి మాట్లాడుతూ నూకరాజు జడ్పీ సమావేశాల్లో తనదైన శైలిలో సమస్యలను లేవనెత్తి వాటినిపరిష్కారానికి కృషి చేసేవారన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేలా తమ అధినేత దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామ న్నారు. అనంతరం అధినేత జగన్ మంజూరు చేసిన రూ. 5 లక్షల చెక్‌ను వారా సతీమణి గంగమ్మకు అందజేశారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ సుబ్రద మాట్లాడు



నూకరాజు కుటుంబీకులకు పరిహారం చెక్‌ను అందచేస్తున్న అమర్‌నాథ్, ఎంపీ

తూ ఉమ్మడి విశాఖ జిల్లా జడ్పీటీసీల సహకారంతో చిట్టింపాడులో నూకరాజు పేరు చిరస్థాయిగా నిలిచేలా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అరకు ఎంపీ తనూజరాణి మాట్లాడుతూ నూకరాజు తాను చనిపోయే మూడు రోజుల ముందు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు పంపించారని, వీటికి అవసరమైన రూ. 25 లక్షలు ఎంపీ నిధులు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. అనంతరం పాడేరు, అరకు ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరాజు, మత్యలింగం, మాజీ ఎంపీ మాధవి, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, అనకాపల్లి డీసీసీ అధ్యక్షుడు సుబ్బన్న, ఏఎస్ఆర్ జిల్లా సీపీ ఐ కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ నూకరాజు సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానికఎంపీపీ రమేశ్‌బాబు, చింతపల్లి ఎంపీపీ అనూషదేవి, ఎంపీటీసీలు, వైసీపీ, టీడీపీ, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలు అదృశ్యమైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

- ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా

చింతపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాలికలు అదృశ్యమైతే వెంటనే సమీపంలోనున్న పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానిక ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రింతాడ బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు అదృశ్యంపై ఫిర్యాదు అందుకున్న జీకేవీధి పోలీసులు కేవలం గంటల వ్యవధిలోనే కేసును ఛేదించారన్నారు. బాలికలు ముగ్గురు 30తేదీన పాఠశాల నుంచి బయటకు వచ్చేశారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసి విశాఖ వెళ్లిపోయారన్నారు. 31తేదీ సాయంత్రం జీకేవీధి పోలీసులకు పాఠశాల ఉపాధ్యాయులు ఫిర్యాదు ఇచ్చారన్నారు. వెంటనే పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. విద్యార్థులు ప్రయాణించిన బస్సులు ఆధారంగా విచారణ చేపట్టి అదే రోజు రాత్రి విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పో



మాట్లాడుతున్న ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా

లీసులు పట్టుకున్నారన్నారు. విద్యార్థినులను జీకేవీధి ఎస్ఐ కె. సురేశ్ సురక్షితంగా తీసుకొచ్చి పాఠశాల వార్డెన్, హెచ్ఎంకి అప్పగిం చిన ట్టు చెప్పారు. అలాగే, విద్యార్థినుల బయటకు వెళ్లరాదని కౌన్సెలింగ్ చేశామన్నారు. పాఠశాలల్లో విద్యార్థినులుగాని, గ్రామాల్లోనున్న బాలికలుకానీ అదృశ్యమైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇస్తే సకాలంలో పట్టుకునే అవకాశం ఉందన్నారు. రింతాడ విద్యార్థినుల మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జీకేవీధి, చింతపల్లి ఎస్ఐలు కె.సురేశ్, వి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి: ఎస్ఐ



వాహన రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ

ముంచంగిపుట్టు, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు నిబంధనలు పాటించకుంటే కేసులు నమోదు చేస్తామని స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఎస్ఐ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాలను, రికార్డులు, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. రికార్డులు సక్రమం గా లేని, హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేశా రు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించరాదని అన్నారు.

బిర్సా ముండా జయంత్యుత్సవాలు



పాఠశాలలో మొక్కలు నాటుతున్న హెచ్ఎం పండన్న, తదితరులు

పెదబయలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం చేసిన ఆదివాసీల జాతి ముద్దు బిడ్డ భగవాన్ బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈనెల 15న జనజాతీయ గౌరవ్ దివస్ (గిరిజన గర్వ దినోత్సవం) జాతీయ స్థాయి వేడుకలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా విద్యా శాఖ అధికారుల ఆ దేశాల మేరకు ఆదివారం సీతగుంట ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1లో హెచ్ఎం పి. పండన్న ఆధ్వర్యంలో బిర్సాముండా జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఆయన త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు చెండా బాలకృష్ణ, పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్య పోటీల విజేతలకు బహుమతులు



నృత్య పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు

పాడేరురూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ పేరిట పాడేరులో శ్రీమోద అవార్డ్స్ వారు జాతీయ స్థాయిలో నిర్వహించిన శాస్త్రీయ నృత్య పోటీలు ముగిశాయి. ఈ నేపథ్యంలో విజేతలుగా నిలిచిన కళాకారులకు నృత్యాంజలి డాన్స్ అకాడమి చైర్మన్, నాట్య శిక్షకులు చైతన్య ప్రభుగిరి కైలాస క్షేత్ర ఆధ్యాత్మిక ధర్మకర్త కొట్టగుళ్లి రమాదేవి ఆదివారం రాత్రి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నృత్య పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి ప్రాచుర్యం, పేరు ప్రఖ్యాతలు చాటేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడ్డాయన్నారు. గిరిజన ప్రాంత విద్యార్థులకు భారతీయ కళారూపాలైన కూచిపూడి, భరత నాట్యంపై ఈ పోటీలతో అ వగాహన పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మోదకొండమ్మ ఆలయ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు, గిరి కైలాస క్షేత్ర ప్రధానకార్యదర్శి యూవీ.రత్నం,గౌరవాధ్యక్షు లు టి.బాబూరావు, సంయుక్త కార్యదర్శి సిద్ధినాతి కొండలరావు, ఆర్గనైజర్ కొండపల్లి సత్యవ తి, రొబ్బి నిర్మల, అమ్మాజీ, భవాని, దేవి పాల్గొన్నారు.

జెన్‌కో నిధులతో తాగునీటి బోర్లు



చింతపల్లిక్యాంప్‌లో బోరు తీయడానికి ప్రదేశం పరిశీలిస్తున్న జెన్‌కో ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు

సీలేరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీలేరు మేజర్ పంచాయతీ పరిధి చింతపల్లిక్యాంప్, జీడీసీ క్యాంప్‌లో ఏపీ జెన్‌కో సీఎస్ఆర్ నిధుల నుంచి రెండు తాగునీటి బోర్లను మంజూరైనట్టు స్థానిక సర్పంచ్ దుర్గో తెలిపారు. స్థానికులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానిక జెన్‌కోసూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి స్పందించి రెండు బోర్లను మంజూరు చేశారన్నారు. ఈ మేరకు ఆదివారంజెన్‌కో ఎస్ఈ భూగర్భ నిపుణులను తీసుకువచ్చి పరిశీలించారని వారు సూచించిన ప్రదేశాల్లో ఈ బోర్లు వేయించనట్టు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీఈ జైపాల్, ఏఈఈ అనుదీప్ పాల్గొన్నారు.

తాటిగుడ జలపాతం మార్గంలో తాత్కాలిక పనులు



తాత్కాలిక కల్వర్టు పనులు చేపడుతున్న దృశ్యం

అనంతగిరి, నవంరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన తాటిగుడ జలపాతానికి వెళ్లేమార్గమధ్యంలో తాత్కాలిక కల్వర్టు ఇటీవల భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో తాటిగుడ, అమలగుడ, తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ స్థితిలో ఈ కల్వర్టు వద్ద ట్రైబల్ వెల్ఫేర్‌శాఖ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. వారం రోజుల్లో శాశ్వత వంతెన నిర్మాణం పూర్తికానున్నట్టు ఏఈ గణేశ్ 'ఆంధ్రజ్యోతి'కి ఈ సందర్భంగా తెలిపారు. వంతెన నిర్మాణంతో పాటుగా రోడ్డు పనులు పూర్తయితే ఆయా గ్రామాలకు మేలు జరగనుందన్నారు.

ఆర్‌ఈసీ రోడ్డు అధ్వానం

... 5వ పేజీ తరువాయి

ఛిద్రమైంది. అడుగడుగునా గోతులు ఏర్పడి దారుణంగా తయారైంది. కొన్నిచోట్ల భారీ వాహనాలు గోతుల్లో కూరుకుపోవడంతో ట్రాఫిక్ స్తంభిస్తున్నది. ఇటువంటి సమయంలో పురుటి నొప్పులు వచ్చిన గర్భిణులను ఆస్పత్రికి తరలించడానికి కుటుంబ సభ్యులు నానాపాట్లు పడాల్సి వస్తున్నది. గోతుల వద్ద వాహనం కుదుపులకు దారిలోనే ప్రసవం అవుతుందా? అన్నట్టుగా పరిస్థితి వుంటుంది. తోటకూరపాలెం నుంచి తీడ, కన్నూరుపాలెం మీదుగా తాళ్లపాలెం వరకు రహదారిని ఇటీవలే అభివృద్ధి చేశారు. ఇటు తోటకూరపాలెం నుంచి రావికమతం వరకు కనీసం గోతులైనా పూడ్చాలని వాహనదారులు, పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ రోడ్డు అభివృద్ధి గురించి ఆర్‌అండ్‌బీ జేఈ సాయిశ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. అభివృద్ధి పనులకు రూ.3 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదించాలమని, నిధులు మంజూరైన వెంటనే టెండర్లు పిలిపి పనులు మొదలుపెడతామని చెప్పారు.



పిల్లవానిపాలెం చెరువు మలుపు వద్ద ఛిద్రమైన రహదారి

పాఠశాల భవనాలు పరిశీలన



బొండాపుట్టులో కర్రలపాకలో నిర్వహిస్తున్న పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో ధర్మారావు

ముంచంగిపుట్టు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలలను ఆదివారం ఎంపీడీవో కె.ధర్మారావు పరిశీలించారు. ఏనుగురాయి పంచాయతీ బొండాపుట్టులో కర్రలపాకలోని పాఠశాలను, దాతల సహాయంతో టొంగికోటలో నిర్మించిన పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కా భవనాలు లేని పాఠశాలలను గుర్తించి, దాతల సహాయంతో తాత్కాలిక షెడ్ల నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానని అన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సింహాచలం ఉన్నారు.

వైసీపీ నేతలు శవరాజకీయాలు మానుకోవాలి

- జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



మాట్లాడుతున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

పాడేరురూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దైవ సన్నిధిలో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ధైర్యం చెప్పాల్సింది పోయి ఈ ఘటనను వైసీపీ నాయకులు రాజకీయం చేయడం దురదృష్టకరమని మాజీ మంత్రి, రాష్ట్ర గిరిజన సమకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయానికి కార్తీక ఏకాదశి సందర్భంగా శనివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో అనూహ్య స్థితిలో తొక్కిసలాట జరిగి భక్తులు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఘటనపై తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలను పరామర్శించి వారిని ఆదుకొనే ప్రయత్నం చేస్తోందన్నారు. కానీ, వైసీపీ నాయకులు ఆనవాయితీ ప్రకారం శవ రాజకీయాలను చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చి ధైర్యం చెప్పాలని హితవు పలికారు. ఘటన జరిగిన వెంటనే రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చిన విషయం వైసీపీ నేతలకు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ కమిషన్ సభ్యులు కిల్లో సాయిరాం, టీడీపీ నాయకులు బాకూరు వెంకటరమణ రాజు, ఎస్.సుబ్బారావు, పి.పాండురంగస్వామి, పి.శశిభూషణం నాయుడు, వి.పూర్ణ, కె.మహేశ్వరి, త్రినాథ్, డి.రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ద్వాదశి వేడుకలు

సీలేరు, నవంబరు 2 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ద్వాదశి సందర్భం గా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అ ర్చ కుడు రామాచారి ఆధ్వర్యంలో స్వామి వారిని తులసి మాలల తో ప్రత్యేకంగా అలంకరించారు. ద్వాదశి ప్రత్యేకతను అర్చకు డు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు మార్గం సుగమం

... 5వ పేజీ తరువాయి

ఉత్పత్తుల ఎగుమతి) డీఎల్ పురం సముద్ర తీరంలోపోర్టును నిర్మించనున్నారు. ఇందుకు 128 ఎకరాల భూమి అవసరమని ప్రభుత్వాన్ని కోరాయి. ఇంకా నక్కపల్లి మండలం గుల్లిపాడు రైల్వేస్టేషన్ నుంచి స్టీల్‌ప్లాంటు వరకు కొత్తగా రైల్వేట్రాక్ నిర్మించాలన్న ప్రతిపాదన కూడా వుంది. మిట్టల్- నిప్పన్ స్టీల్స్‌లో సుమారు 63 వేల మందికి ఉద్యోగ, ఉపాధి లభిస్తాయని భావిస్తున్నారు. స్టీల్‌ప్లాంటుకు అనుబంధంగా ఏర్పాటయ్యే చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో కూడా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది.

మౌలిక వసతుల పనులు మొదలు..

నక్కపల్లి మండలంలో నిర్మాణం కానున్న స్టీల్‌ప్లాంట్‌కు మౌలిక సదుపాయాల కల్పన పనులు మొదలయ్యాయి. స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన నీటిని ఏలేరు లేదా పోలవరం ఎడమ కాలువల నుంచి సరఫరా చేస్తారని తెలిసింది. ఇందుకు కోసం పైపులైన్ వేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. 1100 మి.మీ.ల వ్యాసార్థంగల భారీ పైపులను వెదుళ్లపాలెం, సీహెచ్‌బీ అగ్రహారం గ్రామాల వద్దకు చేరుస్తున్నారు.

తుఫాన్ నష్టంపై త్వరలో నివేదిక

... 5వ పేజీ తరువాయి

ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా భోగాపురంలో మహిళా రైతులు మంత్రిని కలిసి, నది గట్టుకు కోతకు గురైన ప్రదేశంలో రక్షణ గోడను నిర్మించాలని, లేకపోతే భవిష్యత్తులో గండి పడి తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెప్పారు. రక్షణ గోడ ఆవశ్యకతను ఎమ్మెల్యే రాజు కూడా మంత్రికి వివరించారు. రాయపురాజుపేటలో ఎర్రిగెడ్డపై వంతెన, రోడ్డు నిర్మాణం, ఊరగెడ్డపై వంతెన నిర్మాణం చేపడితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే వివరించారు.

బీఎన్ రోడ్డు పనులు నెల రోజుల్లో ప్రారంభం

చోడవరం నియోజకవర్గం పరిధిలో దెబ్బతిన్న బీఎన్ రోడ్డు పనులను నెల రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని మంత్రి రవీంద్ర తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడామని, ఆర్థిక శాఖ క్లియరెన్స్‌కు సంబంధించి నెలకొన్న సమస్యపై చర్చించామని, వీలైనంత త్వరలో ఈ పనులు ప్రారంభం కావడానికి అవకాశం ఉందని చెప్పారు. మంత్రి వెంట టీడీపీ నాయకులు మల్లునాయుడు, పెదబాబు, పూతి కోటేశ్వరరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, మత్స్యరాజు, పల్లా అర్జున్, రామునాయుడు, సకురు కోటేశ్వరరావు, భోగాపురం రాము, కొట్టాపు చిన్న, నేమాల హరి తదితరులు వున్నారు.

ప్రైవేటు ఆలయాలపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

అంశాలపైనా సమగ్ర నివేదికలను రూపొందించి సంబంధిత అసిస్టెంట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు అందజేయాలి. ప్రైవేటు ఆలయాల వివరాలు సేకరించేటప్పుడు ఆలయ భౌగోళిక పరిస్థితులను పరిశీలించడంతోపాటు ఇతర వివరాలను సేకరించడంలో తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్ఐలను సమన్వయపర్చుకోవాలని సూచించారు. ఈ సమాచారం ఆధారంగా ఉత్సవాలు, భక్తుల రద్దీ అధికంగా వుండే రోజుల్లో కాశీబుగ్గ లాంటి దుర్ఘటనలు జరగకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టే యోచనలో ప్రభుత్వం వుంది. ఆయ ఉత్సవాలు జరిగే రోజుల్లో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ ఆదేశాలపై దేవదాయ శాఖ విశాఖ జోన్ డిప్యూటీ కమిషనర్ సుజాతను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. ప్రైవేటు ఆలయాల స్థితిగతులు, భద్రతా ఏర్పాట్లపై అసిస్టెంట్ కమిషనర్లకు సూచనలిచ్చామని, మూడు రోజుల్లో అన్ని ఆలయాలకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తామని చెప్పారు.

టెన్త్, ఇంటర్ పరీక్షలకు సన్నాహాలు

... 5వ పేజీ తరువాయి

నిర్వహించేవారు. ఈ పర్యాయం సీబీఎస్ఈలో రోజుకు ఒక పరీక్ష మాత్రమే నిర్వహిస్తారు. గతంలో ఇంటర్మీడియట్‌లో ఒక రోజు సైన్స్, ఆర్ట్స్ కోర్సులకు సంబంధించి పరీక్షలు నిర్వహించేవారు. ఉదాహరణకు గణితం, అర్థశాస్త్రం పరీక్ష ఒకే రోజు ఉండేది. సీబీఎస్ఈలో గణితం పరీక్ష నిర్వహించే రోజు మరే సబ్జెక్టు పరీక్ష ఉండదు. అందువల్ల 23 రోజులపాటు నిర్వహిస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఇంటర్ పరీక్షలు ముగియకముందే పదోతరగతి పరీక్షలు ప్రారంభమవుతాయి. అందువల్ల కేంద్రాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని ఇరుశాఖల అధికారులు నిర్ణయించారు. జూనియర్ కళాశాలలను ఇంటర్ పరీక్ష కేంద్రాలుగా, పాఠశాలలను పదోతరగతి పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేస్తున్నందున ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడైనా సమస్య తలెత్తే అవకాశం ఉందా అనేదానిపై ఇరు శాఖల అధికారులు సమావేశమై చర్చించారు.

వాడవాడలా అరకు కాఫీ ఘుమఘుమలు

... 5వ పేజీ తరువాయి

ప్రదేశాలలో స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా సెర్ప్ అధికారులు నేటివ్ సంస్థలో ఒప్పందం చేసుకున్నారు. ఒక్కొక్క యూనిట్‌కు రూ.5.9 లక్షలు అవసరమని గుర్తించారు. పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా రూ.4.02 లక్షలు రుణం ఇచ్చి 35 శాతం రాయితీ మంజూరు చేస్తారు. మిగిలిన పెట్టుబడికి స్త్రీనిధి నుంచి రుణం ఇస్తారు. తొలుత నర్సీపట్నం, పాయకరావుపేట, అనకాపల్లి, చోడవరం, ఎస్.రాయవరంలో పెట్టాలని అధికారులు ప్రతిపాదించారు. ముందుగా నర్సీపట్నం మండలం అమలాపురానికి చెందిన ఎస్‌హెచ్‌జీ మహిళకు యూనిట్ మంజూరు చేశారు. శారదానగర్ మెయిన్ రోడ్డు నుంచి బలిఘట్టం వెళ్లే మలుపులో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేస్తారు. అమ్మకాలు అధికంగా జరిగే రద్దీ ప్రదేశాలలో కాఫీ స్టాల్స్ పెట్టుకోవాలని సూచిస్తున్నారు. పొదుపు సంఘాల నుంచి స్టాల్స్ పెట్టుకోవడానికి ముందుకు వస్తే ప్రోత్సహిస్తామని వెలుగు డీపీఎం సత్యనారాయణ తెలిపారు. యాజమాన్యం అనుమతితో అరకు ఫిల్టర్ కాఫీతో పాటు కాఫీ పొడి, ఇతర ఉత్పత్తులు కూడా విక్రయించుకోవచ్చు.



ఆహ్వాన పత్రికను ప్రదర్శిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, నిర్వాహకులు

పుస్తక మహోత్సవానికి స్పీకర్‌కు ఆహ్వానం

నర్సీపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో నిర్వహించనున్న పుస్తక మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధులు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును కోరారు. ఈ మేరకు ఆదివారం క్యాంప్ కార్యాలయంలో స్పీకర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను విడుదల చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడానికి సహకరించాలని సభాపతిని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు త్రిమూర్తులురెడ్డి, జిల్లా అధ్యక్షుడు వర్మ, ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భూలోకమాంబ జాతర



మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే రాజును సత్కరిస్తున్న స్థానిక నాయకులు

చోడవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేట గ్రామంలో ఆదివారం భూలోకమాంబ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే రాజును రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, సర్పంచ్ రామునాయుడు తదితరులు ఘనంగా సత్కరించారు. జాతర సందర్భంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బత్తుల కుమారుడి రిసెప్షన్‌కు ప్రముఖుల హాజరు

- మంత్రులు కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత రాక
- ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల రాకతో వడ్డాదిలో సందడి



వంశీ, పూజిత దంపతులతో హోం మంత్రి అనిత, పక్కన తాతయ్యబాబు



వధూవరులను పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి రవీంద్ర

బుచ్చెయ్యపేట నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు కుమారుడి వివాహ రిసెప్షన్‌కు ప్రముఖులు తరలివచ్చారు. మండలంలోని వడ్డాది గ్రామంలో తాతయ్యబాబు కుమారుడు వంశీ, పూజిత దంపతులకు ఆదివారం రిసెప్షన్ నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, భూగర్భ, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, సుందరపు విజయకుమార్, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, అవంతి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, గిడ్డి ఈశ్వరి, స్టేట్ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీతో పాటు పలువురు ప్రముఖులు, వివిధ ప్రాంతాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ప్రముఖుల రాకతో వడ్డాది సందడిగా మారింది.

తుప్పల తొలగింపు

బుచ్చెయ్యపేట నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళాపురం రహదారికి ఇరువైపులా ఎక్స్‌కవేటర్‌తో ఆదివారం తుప్పలు తొలగించారు. అలాగే రహదారిలో గోతులు పూడ్చివేత కార్యక్రమాన్ని చేపట్టారు. జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు తుమ్మపాల రమేశ్ సొంత నిధులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. దీంతో గ్రామస్థులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేత కె.మాణిక్యం, పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి: నల్లబల్లి క్వారీ నుంచి ఎ.కొత్తపల్లి వెళ్లే రహదారిలో అచ్చియ్యపాలెం వద్ద ఆదివారం జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. సర్పంచ్ సత్య వెంకటరమణ ఆధ్వర్యంలో ఎరుకు మాంబ యూత్ సభ్యులు ఈ కార్యక్రమం చేపట్టారు. తుప్పల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో యువకులు శ్రమదానంతో తొలగించారు.

ఎరువు.. రైతుకు కరువు

- ప్రభుత్వం అందించినా సరఫరా చేయని అధికారులు
- మూడు వారాలుగా గోదాములోనే ముక్కుతున్న యూరియా



యూరియా నిల్వ ఉన్న గోదాము ఇదే...

మాకవరపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేవుడి వరమిచ్చినా.. పూజారి కరుణించని చందంగా తయారైంది మండలంలోని రైతుల పరిస్థితి. మండలానికి ప్రభుత్వం ఎరువులు అందించినా, అధికారుల నిర్లక్ష్యంగా రైతుల చెంతకు చేరడం లేదు. దాదాపు మూడు వారాలుగా గోదాములోనే ముక్కుబెడుతుండడంతో సర్వత్రా అసహనం వ్యక్తమవుతోంది.

మొంథా తుఫాన్‌కు ముందు తామరం పీఏసీఎస్ గోదాముకు సుమారు 270 బస్తాల యూరియా వచ్చింది. అప్పటి నుంచి రైతులకు పంపిణీ చేయకుండా వదిలేశారు. తుఫాన్ వెళ్లిపోయి నాలుగు రోజులు గడుస్తున్నా యూరియా పంపిణీ చేయకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. బ్యాంకు సిబ్బంది మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవరిస్తున్నారని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వరి పొలాలు పొట్ట దశలో ఉన్నాయని, ఇప్పుడు యూరియా వేయకపోతే దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా బ్యాంకు సిబ్బంది, అధికారులు స్పందించి యూరియా అందించాలని వారు కోరుతున్నారు.

పింఛన్ల పంపిణీకి సాహసం

- ప్రమాదకరంగా గెడ్డ దాటి వెళ్లిన ఉద్యోగులు



ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను దాటుతున్న ఉద్యోగులు

దేవరాపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు గ్రామాల్లో పింఛన్ల పంపిణీకి ఉద్యోగులు సాహసమే చేశారు. ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను ప్రమాదకరంగా దాటి వెళ్లి మరీ పింఛన్లు అందించారు. మత్స్య శాఖలో చేస్తున్న ఎండీ.రజాక్, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్‌కే.గౌతమి సచివాలయానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నేరళ్లపూడి, బోడి గరువు, మదనగరువు, బొడ్డగుడ తదితర గ్రామాల్లో గెడ్డ అవతల ఉన్న సుమారు 28 మంది లబ్ధిదారులకు సాహసం చేసి మరీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఇద్దరు సాహసించి గెడ్డలు దాటుకుంటూ గ్రామానికి వెళ్లి పింఛన్లు చేయడంతో పాటు, గౌతమి వైద్య సేవలు కూడా అందించింది. విధి నిర్వహణలో వారి సాహసాన్ని పలువురు అభినందించారు.

బైక్ బోల్తాపడి ఒకరికి గాయాలు

రావికమతం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ పంచాయతీ శివారు పిల్లవానిపాలెం గ్రామానికి చెందిన గుత్తి కొండ నాగేశ్వరరావు ఆదివారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చోడవరం వెళ్లిన ఆయన రాత్రి తిరిగి పిల్లవానిపాలెం వస్తుండగా లోపూడి సమీపంలో బీఎన్ రోడ్డుపై అదుపుతప్పి బోల్తా పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ ఆయన్ను స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన వచ్చి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాత్రి సమయం కావడంతో రోడ్డుపై గొయ్యిని గుర్తించలేకపడిపోయినట్టు స్థానికులు తెలిపారు.

చురుగ్గా జాగారాల గెడ్డ పనులు



గండి మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

మాకవరపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాగారాల గెడ్డ గండి పూడ్చివేత పనులు చురుగ్గా సాగుతున్నాయి. మొంథా తుఫాన్‌తో కురిసిన భారీ వర్షాలకు ఈ గెడ్డకు గండి పడడంతో జి.కోడూరులో వరి పొలాల్లో నీరు చేరింది. దీంతో సుమారు 300 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. ప్రస్తుతం నీటి ఉధృతి తగ్గడంతో మూడు రోజులుగా ఇరిగేషన్ అధికారులు గండి పూడ్చివేత పనులు చురుగ్గా చేపడుతున్నారు. ఇప్పటికే గండి వద్ద కర్రలు పాతి, వాటి మధ్య ఇసుక బస్తాలు ఏర్పాటు చేశారు. సుమారు 200 ఇసుక బస్తాలతో గండి వద్ద పనులు చేపట్టారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు పనులను పర్యవేక్షిస్తున్నారు.

బాధిత కుటుంబానికి 'లారెన్స్' పరిహారం



చెక్కు అందిస్తున్న లారెన్స్ సభ్యులు

మాకవరపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హఠాత్తుగా మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి లారెన్స్ కంపెనీ రూ.8 లక్షల పరిహారం ప్రకటించింది. ఎరకన్నపాలెం గ్రామానికి చెందిన అడిగర్ల సన్యాసిరావు అచ్యుతాపురం లారెన్స్ కంపెనీలో మూడేళ్లుగా ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం యథావిధిగా కంపెనీకి బయలుదేరగా, బస్సులోనే కళ్లు తిరిగి పడిపోవడంతో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. సర్పంచ్ రుత్తల జోగిపాత్రుడుతో కంపెనీ యాజమాన్యం చర్చలు జరిపి, రూ.8 లక్షల పరిహారం ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. అనంతరం దహన కార్యక్రమాలకు రూ.75 వేలను ఆదివారం అందించారు.

తాండవ రహదారి మరమ్మతు చేపట్టాలి

నాతవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్ నుంచి స్పిల్ గేట్ల వద్దకు వెళ్లే మూడు కిలోమీటర్ల రహదారిని మరమ్మతు చేపట్టాలని రైతులు, పర్యాటకులు కోరుతున్నారు. ఈ రహదారి ఒకవైపు రాళ్లు తేలిపోయి, మరోవైపు ఉన్న రహదారి ఛాయలు కనిపించకుండా తుప్పలతో నిండిపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు, ఉద్యోగులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ రోడ్డును బాగు చేయాలని వారు కోరుతున్నారు.

ఉద్యోగులు, పింఛనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

- ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు



ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

కొత్తూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల టెట్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు తెలిపారు. పట్టణంలో ఆదివారం జరిగిన పలు కార్యక్రమాలకు హాజరైన ఆయన మాట్లాడుతూ సీనియర్ ఉపాధ్యాయులను టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) నుంచి మినహాయించాలని రాష్ట్రంలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ సభ్యులంతా కలిసి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరామన్నారు. సమస్య పరిష్కారానికి ఉన్న అవకాశాలన్నీ ఆయన పరిశీలిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం కాగితాలపై ఇచ్చి వెళ్లిపోయిన డీఏ ఉత్తర్వులకు కూటమి అధికారంలోకి వచ్చాక నగదు రూపంలో చెల్లించిందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లకు జీతాలు, పింఛన్లు చెల్లించి వారి ఆత్మాభిమానాన్ని కాపాడాలని ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినప్పటికీ నేరుగా ముఖ్యమంత్రి అన్ని ఉద్యోగ సంఘ నాయకులతో చర్చల్లో పాల్గొని ఒక డీఏను మంజూరు చేయడంతో పాటు వెంటనే అమలులోకి తెచ్చారన్నారు. అలాగే డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకం చేపట్టారన్నారు. ముందుగా ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు చిరంజీవిరావుకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంపాల వెంకటరమణ, రాష్ట్ర కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు కోట్ని రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

5న మెగా జాబ్‌మేళా

చోడవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 5న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.గోవిందరావు తెలిపారు. సుమారు 18 కంపెనీలతో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, పీజీ విద్యార్థులు, 18 నుంచి 35 సంవత్సరాలలోపు నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొని ఉపాధి అవకాశాలు పొందవచ్చని సూచించారు. జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థులు నైపుణ్యం ఏపీ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే విద్యార్హత సర్టిఫికెట్లతో బుధవారం ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించే ప్రదేశానికి హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9494791935 నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

పీడీఎస్‌వో జిల్లా సదస్సు రేపు

చోడవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 'మత్తు వదులుదాం, మంచి సమాజం కోసం పోరాడుదాం' అనే అంశంపై మంగళవారం జిల్లా స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్టు పీడీఎస్‌వో జిల్లా అధ్యక్షుడు నందారపు భాస్కర్ తెలిపారు. స్థానిక గాంధీగ్రామంలోని ఎస్సీ హాస్టల్ వద్ద సదస్సు పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల మోజులో యువత భవిష్యత్ నాశనమవుతున్న ఘటనలు, సమాజంలో పెరిగిపోతున్న దారుణాలపై అవగాహన పెంచేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సదస్సుకు పీడీఎస్‌వో రాష్ట్ర కార్యదర్శి ఎ.సురేశ్, డాక్టర్ పి.శకుంతలరావు, జనసాహితీ జిల్లా అధ్యక్షుడు శివాజీరావు హాజరవుతున్నారన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం



అధ్యక్ష, కార్యదర్శులు నరసింహమూర్తి, బ్రహ్మాజీ

కృష్ణాదేవిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ గొలుగొండ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా చింతల నరసింహమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా టి.బ్రహ్మాజీ, గౌరవ అధ్యక్షుడిగా జి.మురళితో పాటు మరి కొంతమంది సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన వారికి పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రతినిధులు నూకరాజు, ఆర్‌వీఆర్ శర్మ, పడాల అప్పారావు, బాలచంద్రుడు, రవికుమార్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

200 క్యూసెక్కుల నీరు విడుదల

చీడికాడ నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాం జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ఆదివారం ఉదయానికి ఎగువ ప్రాంతాల నుంచి 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో 99 మీటర్లకు చేరింది. దీంతో మెయిన్ గేట్ల ద్వార 200 క్యూసెక్కుల నీటిని బొడ్డేరు నదిలోకి విడుదల చేస్తున్నామని ఏఈఈ బీవీ సత్యనారాయణ తెలిపారు.

మాజీ ఎంపీపీ రమణమ్మ భర్త మృతి

రావికమతం: మాజీ ఎంపీపీ కోట వెంకటరమణమ్మ భర్త గాంధీ ఆదివారం మృతి చెందారు. పోస్టల్ ఉద్యోగిగా ఈ ప్రాంత ప్రజలకు సుపరిచితులైన గాంధీ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో ఆదివారం తుదిశ్వాస విడిచారు.

జాబ్‌మేళాను వినియోగించుకోండి

రోలుగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చోడవరంలో ఈ నెల 5న నిర్వహించే జాబ్‌మేళాను మండలంలోని నిరుద్యోగులు వినియోగించుకోవాలని ఎంపీడీవో నాగేశ్వరరావు సూచించారు. చోడవరం డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ మేళాలో సుమారు 15కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని చెప్పారు. ఈ మేళాపై కార్యదర్శులు గ్రామాల్లో దండోరా వేసి సమాచారం అందించాలని ఆదేశించారు. మరిన్ని వివరాల కోసం 94947919350 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.